



# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 01 | సంచిక: 330 | ఎడిటర్: మేనం శ్యామ్ | ఆదివారం 14-06-2026 | పేజీలు: 10



## సిరా చుక్క

కొత్త తరం మరుగున పడుతుంది
కానీ దారే ఎటు వెళ్లాలో మర్చిపోతుంది..
విజ్ఞానం పెరుగుతుంది కానీ
వివేకం తగ్గిపోతుంది..
చేతిలో ఫోన్ ప్రపంచాన్ని చూపిస్తుంది.
కానీ పక్కనున్న మనిషిని
చూడనివ్వడం లేదు.
సంస్కారం కాలం చెల్లిన వస్తువుగా
కనిపిస్తుంది.
ధనం కోసం పరిగెత్తి వస్తువుగా కనిపిస్తుంది..
ప్రేమ కూడా లాభనష్టాల తూకంతో
కొలవబడుతుంది..
ధర్మం కోసం నిలబడే
మనుషులు తగ్గిపోతున్నారు.
బంధాలు బంధుత్వాలు అవసరాల వరకే
పరిమితం అవుతున్నాయి.
నిజం మాట్లాడే వాడు వెనుకబడి
పోతున్నాడు..
నటన తెలిసిన వాడు నాయకుడుగా
నిలుస్తున్నాడు.
సమాజం అద్దంలో మానవ ముఖం
మసకబారిపోతుంది..
విలువలను పాతర పెట్టి ముందు భవిష్యత్తు
తరాలను గాయపరుస్తున్నాయి.
మానవత్వం మళ్లీ మేల్కొన్న రోజే
ఈ తరానికి నిజమైన
వెలుగు దొరుకుతుంది..
యాకన్న గాడి పెళ్లి..

జనగామ జిల్లా బ్యూరో చీఫ్

# ప్రభుత్వ పాఠశాలలు బాగున్నాయంటే...
# మీ పిల్లలు ఎందుకు అక్కడ చదవడం లేదు?

- ప్రభుత్వ విద్యపై ప్రజల ప్రశ్నలు
- పాలకుల నిబద్ధతపై చర్చ
- పేదవాడి బిడ్డకు ఒక విద్య.. అధికారుల పిల్లలకు మరో విద్యా?




**ప్రజా వాయిస్ ప్రత్యేక కథనం:** తెలంగాణలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నామని ప్రభుత్వం తరచూ ప్రకటిస్తోంది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ తరగతి గదులు, ఇంగ్లీష్ మీడియం బోధన, ఆధునిక భవనాల నిర్మాణం వంటి కార్యక్రమాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రజల మనసుల్లో మాత్రం ఒక ప్రశ్న ఇప్పటికీ సమాధానం కోసం ఎదురుచూస్తోంది.ప్రభుత్వ పాఠశాలలు అంత గొప్పగా ఉంటే... మీ పిల్లలు ఎందుకు అక్కడ చదవడం లేదు.ఇది రాజకీయ విమర్శ కాదు. ప్రభుత్వ విద్యపై సాధారణ ప్రజల్లో నెలకొన్న సందేహానికి ప్రతిబింబం.

### పిల్లల భవిష్యత్తు కోసం అప్పుల బాటలో తల్లిదండ్రులు

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, కూలీలు, చిన్న ఉద్యోగులు తమ పిల్లలకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో భారీ ఫీజులు చెల్లిస్తున్నారు. కొందరు అప్పులు చేస్తుంటే, మరికొందరు భూములు అమ్ముకుంటున్నారు. ఇంకొందరు బంగారం తాకట్టు పెడుతున్నారు.దీనికి ప్రధాన కారణం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుందో అన్న ఆందోళన అని పలువురు తల్లిదండ్రులు చెబుతున్నారు.

### ప్రజలకు ఒక విద్య.. పాలకుల పిల్లలకు మరో విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని ప్రజలకు సూచించే రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉద్యోగులలో చాలామంది తమ పిల్లలను కార్పొరేట్, ప్రైవేట్ లేదా అంతర్జాతీయ పాఠశాలల్లో చదివిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.దీంతో "పేదవాడి బిడ్డకు ఒక విద్య.. ధనికుల పిల్లలకు మరో విద్య" అనే భావన సమాజంలో బలపడుతోందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

### అధికారుల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరితేనే మార్పు.

ప్రభుత్వ విద్యపై నిజమైన నమ్మకం కల్పించాలంటే ముందుగా ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్ అధికారులు, ఉన్నత ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పలువురు సామాజిక వేత్తలు సూచిస్తున్నారు.అలా జరిగితే ఉపాధ్యాయుల కొరత, మరుగుదొడ్ల సమస్య, తాగునీటి వసతి, డిజిటల్ విద్య, నాణ్యమైన బోధన వంటి అంశాలపై మరింత దృష్టి పడుతుందని వారు పేర్కొంటున్నారు.

### నల్లగొండలో కోమటిరెడ్డి ఫౌండేషన్ ప్రయత్నాలు చర్చనీయాంశం

నల్లగొండ జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన కుమారుడు ప్రతీక్ రెడ్డి స్మారకంగా ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలు కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నాలు స్థానికంగా

మిగతా 2లో




- అప్పుల వివాదమా.. ఆస్తులపై కన్నేసిన దందానా?
- కోట్ల రూపాయల బకాయిల వివాదం జిల్లా వ్యాప్తంగా సంచలనం
- ఇంటి ముందు టెంట్ వేసి నిరసన
- భయాందోళనలో కుటుంబ సభ్యులు
- కాలం కలిసిరాక ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డానంటున్న రుణగ్రహీత
- చట్టబద్ధమైన వడ్డీ లావాదేవీలా? లేక భూకబ్జా ప్రయత్నమా? అనే అనుమానాలు
- సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలికి తీయాలంటున్న స్థానికులు

**ప్రజా వాయిస్, ఖమ్మం** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకున్న భారీ వడ్డీ బకాయిల వివాదం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కోట్లాది రూపాయల రికవరీ పేరుతో ఒక వ్యక్తి నివాసం ఎదుట కొందరు టెంట్ వేసుకుని నిరసనకు దిగడం జిల్లాలో సంచలనానికి దారితీసింది. ఈ వ్యవహారంలో ఇరువర్గాలు తమదైన వాదనలు వినిపిస్తుండటంతో అసలు వాస్తవాలపై స్పష్టత అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.నమ్మకంతో అప్పులిచ్చామంటున్న రుణదాతలుతాము నమ్మకంతో పెద్ద మొత్తంలో నగదు అప్పుగా ఇచ్చామని, అంతేకాక ఇతరుల చేత కూడా డబ్బులు ఇప్పించామని రుణదాతలు చెబుతున్నారు. గడువులు దాటిపోతుండటంతో అసలు యజమానులు తమపై ఒత్తిడి తెస్తున్నారని, అప్పులు వసూలు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కష్టార్జిత సొమ్ము తిరిగి పొందేందుకే నిరసన చేపట్టామని పేర్కొంటున్నారు.

**కాలం కలిసిరాలేదంటున్న రుణగ్రహీత వర్గం.**

మరోవైపు అప్పు తీసుకున్న వ్యక్తి స్థానికంగా

మిగతా 2లో

## ఉప ముఖ్యమంత్రి ఇలాకాలో భూబకాసురుల బరితెగింపు?

- అక్రమార్కుల వెనుక ఉన్న ఆ 'రాజకీయ అండ' ఎవరిది?
- ముత్తారంలో నిరుపేదల స్థలం కబ్జా
- తహసిల్దార్ ఆదేశాలకే దిక్కులేదు!
- సెలవు రోజుల్లో శరవేగంగా అక్రమ నిర్మాణాలు!

**ప్రజా వాయిస్ మధిర:** రాష్ట్రంలో సాగుతున్నది పేదల ప్రభుత్వం.. ప్రజా ప్రభుత్వం అని గల్లా ఎగరేస్తున్న వేళ, సాక్షాత్తు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోనే భూబకాసురులు బరితెగిస్తున్నారు! ఒకవైపు రాజధాని నగరంలో హైడ్రా పేరుతో చెరువులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన అక్రమ కట్టడాలను జేసీబీలతో కూల్చివేస్తూ, ప్రభుత్వ ఆస్తులను కాపాడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న పాలనలోనే.. ఇక్కడ క్షేత్రస్థాయిలో మాత్రం కథ అడ్డం తిరిగింది. ఎలాంటి అనుమతులు లేవు,

మిగతా 2లో





## సిరిసిల్ల ఎస్పీపై బండి సంజయ్ ఆగ్రహం

- బీఆర్ఎస్‌పై అంత ప్రేమ ఎందుకు?
- 'మన బడి – మన బాధ్యత' కార్యక్రమానికి ఎస్పీ గైర్హాజరుపై అసంతృప్తి.
- కేంద్రమంత్రి కార్యక్రమానికి జిల్లా పోలీసు అధికారి హాజరు కావాల్సిందేనన్న బండి
- డీఎస్పీ సమక్షంలోనే ఎస్పీపై ఘాటు వ్యాఖ్యలు
- 'అవసరమైతే బీఆర్ఎస్‌లో చేరండి' అంటూ వ్యంగ్య వ్యాఖ్యలు
- రాజకీయ పక్షపాతం లేకుండా అధికారులు పనిచేయాలని సూచన

2 లో

## జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్

- డిపోర్టేషన్ సెంటర్‌కు తరలింపు!
- హెచ్ఏఎల్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న విదేశీయుల గుర్తింపు
- పాస్‌పోర్టులు, వీసాలు లేకుండానే భారత్‌లో నివాసం
- పక్కా సమాచారంతో దాడులు నిర్వహించిన పోలీసులు
- కుత్బుల్లాపూర్ డీసీపీ ఆదేశాల మేరకు కేసు నమోదు
- జోగిపేట డిపోర్టేషన్ సెంటర్‌కు తరలించిన అధికారులు

2 లో






## రేవంత్ రాకతో కనగల్ కళకళ

- తెలంగాణలో అతిపెద్ద అభివృద్ధి కార్యక్రమానికి రంగం సిద్ధం
- రూ.14 వేల కోట్ల హ్యామ్ రోడ్ల ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన
- గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.7 వేల కోట్ల మెగా ప్రణాళిక
- ఎస్ఎల్బీసీ సొరంగ మార్గం, ఏఎమ్ఆర్పీ కాలువల పనులకు గ్రీన్ సిగ్నల్
- నల్లగొండ మున్సిపల్ అభివృద్ధి, తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక నిధులు
- లక్ష మందితో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి

2 లో

## షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీసు

- కాంగ్రెస్‌లో మళ్లీ వర్గపోరు వేడి!
- మహిళలపై అనుచిత వ్యాఖ్యల ఆరోపణలతో చర్యలకు దిగిన హైకమాండ్
- వైరల్ ఆడియోపై వివరణ ఇవ్వాలని షబ్బీర్ అలీకి నోటీసులు
- పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే వ్యాఖ్యలపై ఏఐసీసీ ఆగ్రహం
- కామారెడ్డి కాంగ్రెస్‌లో షబ్బీర్ అలీ, చంద్రశేఖర్ రెడ్డి వర్గాల మధ్య విభేదాలు
- తప్పుడు ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన గడ్డం ఇందుప్రియ

2 లో





## పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ అవార్డు..!

- దేశంలోనే ఉత్తమ పోలీసు ధ్రువీకరణ సేవలకు గుర్తింపు
- ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు వరించిన తెలంగాణ పోలీస్ శాఖ
- 2025-26 పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరు
- జూన్ 19న న్యూఢిల్లీలో డీజీపీ సీవీ ఆనంద్‌కు పురస్కారం
- కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జయశంకర్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం

2 లో

# రేవంత్ రాకతో కనగల్ కళకళ



**ప్రజా వాయిస్, నల్గొండ.** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పర్యటనతో నల్లగొండ జిల్లా కనగల్ మండలం కళకళలాడుతోంది. తెలంగాణలో ఇప్పటివరకు ఎన్నడూ లేని స్థాయిలో వేల కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలకు వేదికగా కనగల్ నిలవబోతోంది. ఈ నెల 17న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న రహదారులు, సాగునీరు, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పలు మెగా ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శనివారం సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పైలాన్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించి ఏర్పాట్లపై కీలక ఆదేశాలు జారీ చేశారు.తెలంగాణ రహదారుల అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతూ రూ.14 వేల కోట్ల వ్యయంతో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 34 ప్యాకేజీలుగా 6,300 కిలోమీటర్ల మేర రహదారులను డబుల్ రోడ్లుగా అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగంగా కనగల్ – ధర్వేశిపురం – డిండి రహదారి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మంత్రి, గ్రామాలను మండలాలు, జిల్లా కేంద్రాలతో అనుసంధానించే పంచాయతీ రాజ్ రహదారుల నిర్మాణానికి రూ.7 వేల కోట్లతో మరో భారీ ప్రాజెక్టును త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ పనులను రెండేళ్లలో పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఇందుకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చినట్లు తెలిపారు.నల్లగొండ జిల్లాకు జీవనాడిగా భావిస్తున్న ఏఎమ్ఆర్ ఎస్ఎల్బీసీ సొరంగ మార్గం పనులను 2028 ఆగస్టు నాటికి పూర్తి చేసి జిల్లాలో రెండు పంటలకు సాగునీరు అందించడమే లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

అదేవిధంగా రూ.450 కోట్లతో చేపట్టనున్న ఏఎమ్ఆర్పీ కాలువల లైనింగ్ పనులకు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక నిధులు మంజూరయ్యాయని, ఈ పనులకు కూడా కనగల్ నుంచే ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్–విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవేకు ఆమోదం లభించిందని, దానికి అనుసంధానంగా బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ సిద్ధమవుతోందని మంత్రి వెల్లడించారు.రైతు సంక్షేమం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొంటూ, జిల్లా వ్యాప్తంగా రైతుల నుంచి రూ.1,800 కోట్ల విలువైన 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, విద్యార్థుల కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వంటి పథకాలు ప్రజలకు చేరువవుతున్నాయని అన్నారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కనగల్‌లో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. సభకు హాజరయ్యే ప్రజలకు తాగునీరు, టెంట్లు, రవాణా, పార్కింగ్ తదితర సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, వై. అశోక్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమేష్, జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిపిఓ శంకర్ నాయక్, డీఎస్పీ శివరామ్ రెడ్డి, ఆర్ అండ్ బి డీఈఈ గణేష్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, గడ్డం అనూప్ రెడ్డి, కూసుకుంట్ల రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలు బాగున్నాయంటే...
# మీ పిల్లలు ఎందుకు అక్కడ చదవడం లేదు?

మొదటి పేజీ తరువాయి



చర్చనీయాంశమయ్యాయి.ప్రభుత్వ పాఠశాలలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దితే విద్యార్థులు సహజంగానే వాటి వైపు మొగ్గు చూపుతారనే అభిప్రాయానికి ఈ కార్యక్రమాలు బలం చేకూర్చాయని స్థానికులు చెబుతున్నారు.

**విద్యా సంస్కరణలకు మరింత వేగం అవసరం**

విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగంలో పలు సంస్కరణలు చేపడుతున్నప్పటికీ, ప్రభుత్వ విద్యపై ప్రజల్లో పూర్తి స్థాయి విశ్వాసం ఏర్పడాలంటే మరింత కఠినమైన, దీర్ఘకాలిక నిర్ణయాలు అవసరమని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.

**సమాన విద్య లేకుంటే సమాన అవకాశాలు ఎలా.**

ప్రపంచ దేశాలు కృత్రిమ మేధస్సు, పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలతో ముందుకు దూసుకుపోతున్న తరుణంలో మన దేశంలో ప్రభుత్వ పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలలు అనే రెండు వేర్వేరు విద్యా వ్యవస్థలు కొనసాగడం ఆందోళన కలిగించే అంశమని విశ్లేషకులు అంటున్నారు.పేదవాడి బిడ్డకు ఒక రకమైన విద్య, ధనికుల పిల్లలకు మరో రకమైన విద్య అందుతున్నంత వరకు సమాన అవకాశాలు సాధ్యం కాదని వారు పేర్కొంటున్నారు.

**మారాల్సింది ప్రజలా... పాలకులా.**

గ్రామాల్లో సర్పంచులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతున్నారు. అయితే అదే ప్రజాప్రతినిధుల పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.ప్రభుత్వ విద్యను కాపాడాలంటే భవనాలు నిర్మించడం మాత్రమే కాకుండా పాలకుల నిబద్ధత కూడా ప్రభుత్వ పాఠశాల గేటు దాటి లోపలికి రావాలని ప్రజలు కోరుతున్నారు.

**మీ పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదవడానికి సిద్ధమా.**

ప్రజలు అడుగుతున్న ఈ ఒక్క ప్రశ్నకు పాలకులు, అధికారులు ఆచరణలో సమాధానం చెప్పగలిగిన రోజే ప్రభుత్వ విద్యపై పూర్తి స్థాయి నమ్మకం పెరుగుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ విద్య నిజంగా బలోపేతం కావాలంటే మారాల్సింది ప్రజలు కాదు... ముందుగా విధానాలు, పాలకుల ఆలోచనా విధానం, అధికార వ్యవస్థ అని పలువురు విద్యావేత్తలు స్పష్టం చేస్తున్నారు. అప్పుడే పేదవాడి బిడ్డకు కూడా సమాన అవకాశాలు లభించి, నిజమైన విద్యా విప్లవానికి నాంది పలుకుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# ఉప ముఖ్యమంత్రి ఇలాకాలో భూబకాసురుల బరితెగింపు?

మొదటి పేజీ తరువాయి

కనీసం హక్కు పత్రాలూ లేవు.. అయినా ప్రభుత్వ రికార్డుల్లో నిరుపేదల ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూమిపై అక్రమ నిర్మాణాలు శరవేగంగా సాగిపోతున్నాయి. స్థానిక రెవెన్యూ యంత్రాంగం నోటీసులు ఇచ్చినా, తహసిల్దార్ ఆదేశించినా సరే.. అధికారుల నిస్సహాయతను చూసి నవ్వుకుంటూ, చట్టాన్ని బేఖాతరు చేస్తూ ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం ముత్తారం గ్రామంలో సాగుతున్న ఈ భూఆక్రమణల పర్వం చూస్తుంటే.. అసలు జిల్లాలో ప్రభుత్వ నిఘా ఉందా? లేక అక్రమార్కుల వెనుక ఉన్న రాజకీయ అండదండలకు అధికార యంత్రాంగం లొంగిపోయిందా? అనే ప్రశ్నలు ఇప్పుడు బహిరంగంగానే తలెత్తుతున్నాయి.ముదిగొండ మండలం ముత్తారం గ్రామంలోని సర్వే నంబర్ 42/పి లో గల సుమారు రెండు కుంటల ప్రభుత్వ భూమిని అక్రమార్కులు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. రికార్డుల ప్రకారం ఇది నిరుపేదల ఇళ్ల స్థలాల కోసమేనని స్పష్టమవుతుండటంతో.. స్థానిక తహసిల్దార్ రంగంలోకి దిగి నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించినట్లు సమాచారం. అయితే, అధికారుల ఆదేశాలు కనీసం ఖాతరు చేయని అక్రమార్కులు, తమకున్న రాజకీయ, ధన బలంతో పనులను శరవేగంగా కొనసాగిస్తున్నారు. అసలు ఈ మండలంలో అధికార వ్యవస్థ బతికే ఉందా? లేక అక్రమార్కులకు లొంగిపోయిందా? అని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ స్థలంపై ఎలాంటి హక్కు పత్రాలు గానీ, గ్రామ పంచాయతీ అనుమతులు గానీ లేవు. అధికారుల కళ్లు గప్పి, శని, ఆదివారం వంటి ప్రభుత్వ సెలవు దినాలనే అస్త్రంగా చేసుకుంటూ యంత్రాంగం నిఘా లేని సమయాన్ని చూసి దొంగచాటుగా నిర్మాణాలను



ముమ్మరం చేస్తున్నారు. తమకు కేటాయించిన స్థలాన్ని కాపాడుకునేందుకు వెళ్లిన నిరుపేద లబ్ధిదారులపై ఆక్రమణదారులు కనీస మానవత్వం లేకుండా ఎదురుదాడికి దిగుతూ, అత్యంత అరాచకంగా వ్యవహరిస్తున్నారు.ఇక కొసమెరుపు ఏంటంటే తహసిల్దార్ కాదు కదా.. స్థానిక మంత్రి వచ్చినా ఈ నిర్మాణాలను ఆపలేరు? అంటూ కబ్జాదారులు బహిరంగంగానే సవాల్ విసురుతుండటం గమనార్హం. కేవలం కాగితపు ఆదేశాలు ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదని, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయికి వచ్చి సదరు అక్రమ కట్టడాలను తక్షణమే జేసీబీలతో కూల్చివేసి, ప్రభుత్వ ముద్ర వేయాలని బాధితులు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులకే సవాల్ విసురుతూ, బాధితులను బెదిరిస్తున్న చట్టవ్యతిరేక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# వడ్డీ వలలో నేలకొండపల్లి..

మొదటి పేజీ తరువాయి

మంచి పేరు ప్రతిష్టలు కలిగిన వ్యక్తేనని, ఎవరినీ మోసం చేయాలనే ఉద్దేశం లేదని ఆయనకు సన్నిహితులు చెబుతున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఎదురైన నష్టాల కారణంగా ప్రస్తుతం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తనకున్న ఆస్తులను విక్రయించి బకాయిలు చెల్లించేందుకు కొంత సమయం కోరినట్లు సమాచారం. అయినప్పటికీ ఆ అవకాశాన్ని ఇవ్వకుండా ఒత్తిడి పెంచుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

**ఒంటరి మహిళపై మానసిక ఒత్తిడా?**

సదరు వ్యక్తి ఇంట్లో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మహిళ ఒక్కరే ఉన్న సమయంలో ఇంటి ముందు నిరసన చేపట్టడం వివాదానికి మరింత దారితీసింది. డబ్బులు చెల్లించాలంటూ లేదా ఆస్తులు బదలాయించాలని ఒత్తిడి తీసుకురావడం ద్వారా కుటుంబాన్ని మానసికంగా వేధిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో స్థానికంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**వడ్డీ వ్యాపారాల చట్టబద్ధతపై ప్రశ్నలు**

ఇంత పెద్ద మొత్తంలో జరిగిన లావాదేవీలకు చట్టబద్ధమైన మనీ లెండింగ్ అనుమతులు ఉన్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధిక వడ్డీలకు ఆశపడి తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకుని ఆస్తులను స్వాధీనం చేసుకునే ఘటనలు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వెలుగుచూస్తున్న నేపథ్యంలో, ఈ వ్యవహారంపై కూడా సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.




**అధికారుల జోక్యం కోరుతున్న ప్రజలు.**

డయల్-100కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇది సివిల్ వివాదమని పోలీసులు వెనుదిరిగినట్లు సమాచారం. అయితే నివాస గృహం వద్ద అనుమతులు లేకుండా నిరసన చేపట్టడం, ఒంటరిగా ఉన్న మహిళను మానసిక ఒత్తిడికి గురిచేయడం వంటి అంశాలు శాంతిభద్రతల కోణంలో పరిశీలించాల్సిన అవసరం ఉందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒకవైపు అనధికారిక వడ్డీ దందా, మరోవైపు చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ధోరణులపై జిల్లా ఉన్నతాధికారులు, ఆదాయపు పన్ను శాఖ, రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికి తీయాలని ప్రజలు కోరుతున్నారు.

# నగరంలో యూట్యూబర్ దారుణ హత్య

- **ఇంట్లోకి చొరబడి రాడ్లతో దాడి!**
- **ప్రార్థనలు ముగించుకుని ఇంటికి వస్తుండగా వెంటాడిన దుండగులు**
- **ఇంట్లోకి చొరబడి రాడ్లు, జిమ్ పరికరాలతో దాడి**
- **తీవ్ర గాయాలతో ఘటనాస్థలంలోనే మృతి చెందిన యూట్యూబర్ మహబూబ్**
- **భార్య సోదరుడే ప్రధాన నిందితుడిగా గుర్తించిన పోలీసులు**
- **కుటుంబ కలహాలు, ప్రేమ వివాహమే హత్యకు కారణమా..? కోణంలో దర్యాప్తు**

**హైదరాబాద్, ప్రజా వాయిస్:**నగరంలో ఓ యూట్యూబర్ దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. గోల్కొండ పరిధిలోని కుమార్‌వాడి ప్రాంతానికి చెందిన యూట్యూబర్ షేక్ మహబూబ్‌ను ముగ్గురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి రాడ్లు, జిమ్ పరికరాలతో దాడి చేసి హత్య చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది.

**వెంటాడి మరీ హత్య**

పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం ప్రార్థనలు ముగించుకుని ఇంటికి వెళ్తున్న మహబూబ్‌ను ముగ్గురు వ్యక్తులు వెంబడించారు. తనను కొందరు ఫాలో అవుతున్నారని గుర్తించిన మహబూబ్ పరుగెత్తుకుంటూ ఇంట్లోకి వెళ్లాడు. అయితే దుండగులు అక్కడితో ఆగకుండా ఇంట్లోకి చొరబడి అతడిపై విచక్షణారహితంగా దాడి చేశారు.

**ఘటనాస్థలంలోనే మృతి**

రాడ్లు, జిమ్ పరికరాలతో చేసిన దాడిలో మహబూబ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

**భార్య సోదరుడిపై అనుమానం**

ఈ కేసులో మహబూబ్ బావమరిది (భార్య సోదరుడు) షేక్ సోహైల్‌ను ప్రధాన నిందితుడిగా పోలీసులు గుర్తించారు. సోహైల్ తన అనుచరులు అఫ్, జాబిర్‌లతో కలిసి ఈ హత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**ప్రేమ వివాహమే వివాదాలకు కారణమా..?**

ఏడాదిన్నర క్రితం మహబూబ్ ప్రేమ వివాహం చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ పెళ్లి యువతి కుటుంబ సభ్యులకు ఇష్టం లేకపోవడంతో అప్పటి నుంచి ఇరు కుటుంబాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. దంపతులకు బిడ్డ పుట్టినప్పటికీ పరిస్థితుల్లో మార్పు రాలేదని, కుటుంబ కలహాలే ఈ హత్యకు దారితీసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

# జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** నగరంలోని జీడిమెట్లలో అక్రమంగా నివాసం ఉంటున్న ఏడుగురు బంగ్లాదేశీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. దేశంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించి, ఎలాంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండానే భారత్‌లో నివసిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారం మేరకు గాజులరామారం హెచ్ఏఎల్ కాలనీలో దాడులు నిర్వహించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

**పత్రాలు లేకుండానే నివాసం**

అరెస్ట్ చేసిన వ్యక్తులు అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నట్లు గుర్తించిన పోలీసులు, వారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు లేదా ఇతర చట్టబద్ధ పత్రాలు ఏవీ లేవని గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకుండానే దేశంలో నివసిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**ప్రత్యేక నిఘాతో పట్టివేత**

దేశంలోని పలు ప్రాంతాల్లో బంగ్లాదేశీయులు అక్రమంగా నివసిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో జీడిమెట్ల ప్రాంతంలో విదేశీయులు అనుమానాస్పదంగా నివసిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు.

**డిపోర్టేషన్‌కు ఏర్పాట్లు**

కుత్బుల్లాపూర్ డీసీపీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, అరెస్ట్ చేసిన ఏడుగురిని మెదక్ జిల్లా జోగిపేట డిపోర్టేషన్ సెంటర్‌కు తరలించారు. వారిని తిరిగి బంగ్లాదేశ్‌కు పంపేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

# సిరిసిల్ల ఎస్పీపై బండి సంజయ్ ఆగ్రహం

**సిరిసిల్ల, ప్రజా వాయిస్:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గీతేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలోని కుసుమ రామయ్య ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన 'మన బడి – మన బాధ్యత' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, జిల్లా ఎస్పీ గైర్హాజరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

**ఎస్పీ ఎందుకు రాలేదు?**

కార్యక్రమంలో డీఎస్పీ మాత్రమే హాజరుకావడంతో బండి సంజయ్ నేరుగా స్పందించారు. 'ఎస్పీ ఎందుకు రాలేదు?' అని ప్రశ్నిస్తూ, తాను సాధారణ కార్యకర్తను కాదని, కేంద్ర మంత్రిగా పాల్గొంటున్న కార్యక్రమానికి జిల్లా పోలీసు అధికారి హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు.

**ఎస్పీపై ఘాటు వ్యాఖ్యలు**

ఈ సందర్భంగా డీఎస్పీని ఉద్దేశించి మాట్లాడిన బండి సంజయ్.. 'మీ ఎస్పీకి బీఆర్ఎస్‌పై అంత ప్రేమ ఎందుకు?' అని ప్రశ్నించారు. అవసరమైతే బీఆర్ఎస్ పార్టీలో చేరాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు సభలో చర్చనీయాంశంగా మారాయి.

**అధికారులకు సూచనలు**

అధికార యంత్రాంగం రాజకీయ పక్షపాతం లేకుండా పనిచేయాలని, ప్రజా ప్రతినిధులు మరియు ప్రభుత్వ కార్యక్రమాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని బండి సంజయ్ సూచించారు. విధి నిర్వహణలో తటస్థతను పాటించాలని అధికారులకు సూచించారు.

**రాజకీయ వర్గాల్లో చర్చ**

కేంద్రమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. జిల్లా ఎస్పీ గైర్హాజరు నేపథ్యంలో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై వివిధ రాజకీయ పార్టీల నేతలు స్పందించే అవకాశం కనిపిస్తోంది.

# పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ అవార్డు..!

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీస్ శాఖకు జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. దేశంలోనే ఉత్తమ పోలీసు ధ్రువీకరణ సేవలు అందించినందుకు తెలంగాణ పోలీసులకు ప్రతిష్ఠాత్మకమైన 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు' దక్కింది. 2025-26 సంవత్సరానికి సంబంధించిన పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ప్రక్రియలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు ఈ అవార్డుకు తెలంగాణ పోలీస్ శాఖను కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది.

**కేంద్రం నుంచి అధికారిక ఆహ్వానం**

ఈ అవార్డును అందుకోవాల్సిందిగా తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ఆహ్వానం పంపింది. జూన్ 19న న్యూఢిల్లీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో డీజీపీ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

**జయశంకర్ చేతుల మీదుగా సత్కారం**

కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జయశంకర్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం జరగనుంది. వేగవంతమైన, పారదర్శకమైన మరియు ప్రజా కేంద్రిత పోలీసు ధ్రువీకరణ సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేస్తున్నారు.

**సాంకేతికతతో జాతీయ ఖ్యాతి**

సాంకేతిక ఆధారిత వెరిఫికేషన్ విధానం, సమర్థవంతమైన సేవల నిర్వహణ తెలంగాణ పోలీసులకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. ప్రజలకు వేగంగా, పారదర్శకంగా సేవలు అందించడంలో తెలంగాణ పోలీస్ శాఖ చూపిన నిబద్ధతకు ఈ అవార్డు మరో నిదర్శనంగా నిలిచింది.

**ప్రతిష్ఠను మరింత పెంచిన ఘనత**

ఈ జాతీయ పురస్కారం తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచడంతో పాటు భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రేరణగా నిలవనుందని అధికారులు పేర్కొన్నారు.

# షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీసు

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా, అలాగే పార్టీ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వైరల్ ఆడియో వ్యవహారంపై షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

**వైరల్ ఆడియోతో కలకలం**

సోషల్ మీడియాలో వైరల్ అయిన ఆడియో క్లిప్‌లో షబ్బీర్ అలీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారడంతో కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దిగింది.

**వివరణ కోరిన హైకమాండ్**

పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం, అంతర్గత వ్యవహారాలను బహిరంగ చర్చకు తీసుకురావడంపై ఏఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ అంశాలపై పూర్తి వివరణ ఇవ్వాలని షబ్బీర్ అలీని ఆదేశించింది.

**కామారెడ్డిలో ముదురుతున్న వర్గపోరు**

మరోవైపు కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో వర్గ విభేదాలు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. షబ్బీర్ అలీ వర్గం, చంద్రశేఖర్ రెడ్డి వర్గం మధ్య విభేదాలు బహిరంగంగా బయటపడుతున్నాయి. పరస్పర విమర్శలు, ఆరోపణలతో స్థానిక కాంగ్రెస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి

**పోలీసులకు ఇందుప్రియ ఫిర్యాదు**

సొంత పార్టీ నేతలపై విమర్శలు, దుష్ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

**వేడెక్కిన కాంగ్రెస్ రాజకీయాలు**

ఏఐసీసీ క్రమశిక్షణ చర్యలు, వర్గపోరు, పరస్పర ఆరోపణలతో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఈ పరిణామాలు పార్టీ అంతర్గత పరిస్థితులపై చర్చకు దారితీస్తున్నాయి.

## గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన ఐక్యత పెరగాలి

- యువ నాయకుడు కేకే కృష్ణ
- మైసమ్మ దేవాలయ నిర్మాణానికి కేకే కృష్ణ రూ.50 వేల విరాళం



(ప్రజా వాయిస్ షాద్‌నగర్)చిన్న ఉమ్మెంత్యాల గ్రామ పంచాయతీ పరిధి లోని మైసమ్మ దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రముఖ సామాజికవేత్త సీనియర్ కాంగ్రెస్ యువ నాయకుడు కేకే కృష్ణ మైసమ్మ దేవాలయ అభివృద్ధి కోసం రూ.50,000ల విరాళాన్ని అందించారు ఈ సందర్భంగా కేకే కృష్ణ మాట్లాడుతూ... గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరియాలని దేవాలయాలు కేవలం పూజా స్థలాలే కాకుండా ప్రజల మధ్య ఐక్యత సోదరభావం పెంపొందించే కేంద్రాలుగా నిలవాలని అన్నారు గ్రామ ప్రజలు కుల మత భేదాలు లేకుండా ఐకమత్యంతో కలిసి మెలిసి జీవిస్తూ ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు దేవాలయ అభివృద్ధికి సహకరించడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ పుల్లమ్మ లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి, రాఘవేందర్ రెడ్డి, రామచంద్రయ్య, మాజీ వార్డు సభ్యుడు కబీర్, వార్డు సభ్యుడు క్రీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.గ్రామస్తులు కేకే కృష్ణ చేసిన విరాళాన్ని అభినందిస్తూ, దేవాలయ అభివృద్ధికి అందించిన సహకారం పట్ల కృతజ్ఞతలు తెలిపారు..





## కోదాడలో కాంట్రాక్టర్ రాజ్యం..!

- ప్రభుత్వాలు మారినా మారని పెత్తనం
- పెద్దవాగు పూడికతీత పనుల్లో అక్రమాల ఆరోపణలు
- వాగు మట్టిని వాగు పక్కనే పోస్తున్నారంటూ విమర్శలు
- ప్రభుత్వ మట్టిని ప్రైవేట్ అవసరాలకు విక్రయిస్తున్నారనే ప్రచారం
- అధికారుల మౌనంపై అనుమానాలు
- సమగ్ర విచారణకు ప్రజల డిమాండ్

**ప్రజా వాయిస్,కోదాడ:** కోదాడ మున్సిపాలిటీలో ఓ కాంట్రాక్టర్ వ్యవహారం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా కీలక పనులు మాత్రం అదే కాంట్రాక్టర్ చేతుల్లోనే ఉంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కీలక కాంట్రాక్టులను దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్, ప్రస్తుత ప్రభుత్వంలోనూ తన హవా కొనసాగిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రస్తుతం పట్టణంలోని పెద్దవాగు పూడికతీత పనుల నిర్వహణపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.వాగులో నుంచి తొలగించిన పూడికను పూర్తిగా తరలించకుండా, కొంత భాగాన్ని వాగు పక్కనే పోస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురిస్తే ఆ మట్టంతా తిరిగి వాగులోకే చేరే పరిస్థితి ఉంటుందని, దీంతో పూడికతీత పనుల ఉద్దేశమే దెబ్బతింటుందని అంటున్నారు.మరోవైపు, పూడికతీత పేరుతో తీసిన మట్టిని ప్రైవేట్ ప్లాట్లు, గృహ నిర్మాణాలకు తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పెద్ద ఎత్తున ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలింపులు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆస్తిని వ్యక్తిగత లాభాలకు వినియోగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. పనుల నాణ్యతను పరిశీలించాల్సిన అధికారులు ఎక్కడున్నారని, ప్రభుత్వ ఆస్తి దుర్వినియోగం జరుగుతుంటే ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల మౌనం వెనుక ఏమైనా కారణాలున్నాయా అనే చర్చ కూడా సాగుతోంది.ఇటీవల నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అభివృద్ధి పనులపై సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్న మరుసటి రోజే పూడికతీత పనులపై ఆరోపణలు తెరపైకి రావడం విశేషం. దీంతో ఈ వ్యవహారం పట్టణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.పెద్దవాగు పూడికతీత పనులపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే దృష్టిసారించి సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, చూసీచూడనట్లు వ్యవహరించిన అధికారులపైనా చర్యలు ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనం ప్రజల కోసమే గానీ, కొందరి ఆదాయ వనరుగా మారకూడదు అని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

## పెండింగ్‌లో రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి


- లేకపోతే సీఎం నివాసం ముట్టడిస్తాం:
- బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ లింగయ్య యాదవ్

**ప్రజా వాయిస్,సూర్యాపేట:** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ వీరబోయిన లింగయ్య యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేసి ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నింటినీ ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులు చదువుకుని ప్రభుత్వాలను ప్రశ్నిస్తారనే భావనతోనే వారిని విద్యకు దూరం చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు.ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ బయ్య రాజేష్, శ్రీరామ్, సాయిచరణ్, గణేష్, మంద శివ తదితరులు పాల్గొన్నారు.

## పే స్లిప్ లో జీతాలు చూసి ఆందోళన చెందుతున్న కార్మికులు!!

- 14 వ వేతన ఒప్పందం అగ్రిమెంట్ ప్రకారం కార్మికులకు పెరిగిన జీతాలు
- రూ /15000 అదనంగా పెంచిన జీతాలు పే స్లిప్ లో కనపడని వైనం
- పే స్లిప్ లో రూ/12000 మాత్రమే కనపడటం తో ఆందోళన లో ఐటీసీ పర్మినెంట్ కార్మికులు
- అగ్రిమెంట్ చేసిన గుర్తింపు సంఘ యూనియన్ పై అసహనం తో ఉన్న కార్మికులు




**ప్రజా వాయిస్ బూర్గంపాడు** బూర్గంపాడు మండలం, సారపాక ప్రాంతంలో ఉన్న ఐటీసీ పేపర్ కర్మాగారంలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగస్తుల జీతాల పెంపు నిమిత్తం, 14వ వేతన ఒప్పంద అగ్రిమెంట్ ప్రకారం 15 వేల రూపాయలతో పాటు మరో 1000 అదనం మొత్తంగా పదహారువేల రూపాయలు పెంచుతూ టిఎన్టియుసి గుర్తింపు సంఘ యూనియన్ మార్చి 31వ తేదీన అగ్రిమెంట్ చేయడం జరిగింది.అయితే ఐటీసీ కర్మాగారంలో పర్మినెంట్ ఉద్యోగస్తులుగా పనిచేస్తున్న కార్మికులలో సుమారు 37 వేల నుండి 80 వేల వరకు ప్రతినెల జీతాలు అందుకునే పర్మినెంట్ ఉద్యోగస్తులుకు ఉన్న జీతానికి16 వేల రూపాయలు కలుపుకొని జూన్ నెలలో పేస్లిప్ ద్వారా జీతాలు అందుకోవాల్సి ఉంది.కానీ ఈనెల పే స్లిప్పులు చూసిన ఉద్యోగస్తుల కొంత ఆందోళనకు గందరగోళానికి గురయ్యారు. దీనికి గల కారణం ప్రతినెల తీసుకుని జీతానికి అదనంగా 16 వేల రూపాయలు వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్న ఉద్యోగస్తులకు వారి పే స్లిప్ లో పదహారువేలకు బదులు 12 వేల రూపాయలు మాత్రమే కనబడడంతో ఉద్యోగస్తులు కొంత ఆందోళన చెందుతున్నారు. పే స్లిప్పులు చూసిన ఉద్యోగ కార్మికులు ఇదేమిటని ప్రశ్నించగా టెక్నికల్ ఇష్యూ వల్లే మీకు రావాల్సిన కొంత అమౌంట్ ఆగిందనే సమాధానం ఐటీసీ యాజమాన్యంతో పాటు, టిఎన్టియుసి గుర్తింపు సంఘ యూనియన్ చెప్పడం ఉద్యోగస్తులలో కొంత అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. మరోవైపు కొంతమందికి ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన పే స్లిప్పులలో వచ్చిన జీతాలను చూసి వాటి లెక్కలు తేల్చుకోలేక గందరగోళంలో పడిపోయారు. ఆసియాలోనే అది పెద్దదైన ఐటీసీ పేపర్ కర్మాగారం ఉద్యోగస్తుల పే స్లిప్ లను కూడా సరిగా ఇవ్వలేకపోతుందనే వార్తలు కూడా లోపల చక్కర్లు కొడుతున్నాయి మరి ఇదే పరిస్థితి ప్రతి నెల కొనసాగుతుందా..? వేతన ఒప్పందం ద్వారా ఉద్యోగస్తులకు రావాల్సిన 1600 అదనపు డబ్బులను వచ్చే నెల నుండి అయన సరిగా ఇస్తారా..? అనే అనుమానాలు, సందేహాలు ప్రస్తుతం ఐటీసీ ఉద్యోగ కార్మికుల లో నెలకొంది.

## 12 రోజుల పాపకు రక్తదానం చేసిన రాజేంద్రప్రసాద్

- 35వ సారి రక్తదానం చేసిన రాజేంద్రప్రసాద్
- అత్యవసర సమయంలో ప్రాణదాతగా మారిన యువ సంకల్ప ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు
- రక్తదానం చేయండి.. ప్రాణాలను కాపాడండి



**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :**"రక్తం ఇచ్చి ప్రాణం పోయడం కన్నా గొప్ప సేవ మరొకటి లేదు" అనే సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ సుల్తానాబాద్ గాంధీనగర్‌కు చెందిన బీజేపీ జిల్లా కోశాధికారి, యువ సంకల్ప ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కామనీ రాజేంద్రప్రసాద్ అత్యవసర పరిస్థితుల్లో 12 రోజుల పసికందు ప్రాణాలను కాపాడేందుకు తన 35వ రక్తదానాన్ని చేశారు.సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన 12 రోజుల పాప కరీంనగర్‌లోని స్టార్ చిల్డ్రన్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా అత్యవసరంగా బి పాజిటివ్ రక్తం అవసరమైంది. ఈ విషయాన్ని గాలిపెల్లి కుమార్ ద్వారా తెలుసుకున్న రాజేంద్ర ప్రసాద్‌కు సమాచారం అందించగా, వెంటనే స్పందించి కరీంనగర్‌కు చేరుకుని స్థానిక బ్లడ్ బ్యాంకులో 35వ సారి రక్తదానం చేసి చిన్నారి కుటుంబానికి అండగా నిలిచారు.రాజేంద్రప్రసాద్ చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ రాజ్ కుమార్ అభినందిస్తూ, సమాజంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి అవసరమైన వారికి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, నేత్రదానం ద్వారా మరొకరికి వెలుగునివ్వవచ్చని తెలిపారు. అలాగే ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం వంటి సేవా కార్యక్రమాల్లో ప్రజలు ముందుండాలని కోరారు.

## కోళ్ల పౌల్ట్రీ ఫారం.. చికెన్ సెంటర్లపై చర్యలుతీసుకోవాలి

- కోళ్ల ఈకలు ప్రమాదాలకు నిలయాలు దుర్వాసనతో రోగాల బారిన పడుతున్న వానదారులు
- మారని అధికారుల పనితీరు

**ప్రజా వాయిస్ హన్మకొండ** /ఆత్మకూర్ పౌల్ట్రీ ఫారం. చికెన్ సెంటర్ల యజమానులు 163 జాతీయ రహదారికి ఆనుకొని కోళ్ల వ్యర్థ పదార్థాలను పడేయడంతో వాహనదారులు రోడ్డుపై వెళుతుంటే వీచే గాలికి కోడి ఈకలతో రోడ్డు ప్రమాదాలు దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు పరకాల నియోజకవర్గం ఆత్మకూరు గ్రామ శివారులో చలి వాగు వద్ద జాతీయ రహదారికి ఆనుకొని పౌల్ట్రీ ఫారం..చికెన్ సెంటర్ యజమానులు కోళ్ల వ్యర్థ పదార్థాలను పడేయడంతో దుర్వాసన వెదజల్లి రోగాల బారిన పడుతున్నామని. గాలులు వచ్చినప్పుడు కోడి ఈకలు మీద పడడంతో ప్రమాదాలకు గురైన సంఘటనలు కోకొల్లలు జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా సంబంధిత మండల అధికారులు పౌల్ట్రీ ఫారం యజమానులపై దృష్టి సారించాలని చికెన్ సెంటర్ లపై చర్యలు తీసుకొని కోళ్ల వ్యర్థ పదార్థాలను తొలగించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని వాహనదారులు సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు.





## బంగారం మెరిపిస్తామని మోసం

- 8 గ్రాముల బంగారం కాజేసిన కేటుగాళ్లు

**ప్రజా వాయిస్ తొగుట** బంగారు ఆభరణాలను కొత్తవాటిలా మెరిపిస్తామని నమ్మబలికి మహిళలను మోసం చేస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో శనివారం ఇద్దరు యువకులు ఈ తరహా మోసానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది.గ్రామంలోని పలువురు ఇళ్లకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు తమ వద్ద ఉన్న ప్రత్యేక పౌడర్, లిక్విడ్‌తో బంగారం, వెండి ఆభరణాలను తెల్లగా చేసి మెరిపిస్తామని చెప్పారు. అయితే చాలా మంది వారి మాటలను నమ్మలేదు. చివరకు గ్రామానికి చెందిన కళ్లెపు అనూష ఇంటికి వెళ్లిన వారు ముందుగా ఆమె చేతులపై పౌడర్ వేసి నమ్మకం కల్పించారు.ఆ తర్వాత అనూష మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు, ఆమెతో పాటు ఆమె చెల్లి కాళ్లలో ఉన్న వెండి పట్ట గొలుసులను తీసుకుని శుభ్రం చేస్తామని చెప్పారు. ఏదో రసాయన ద్రావణంలో వాటిని ముంచి కొంతసేపటి తర్వాత తిరిగి ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు.అయితే ఆభరణాల బరువు తక్కువగా ఉన్నట్లు గమనించిన బాధితులు స్థానిక బంగారు దుకాణంలో తూకం వేయించగా సుమారు 8 గ్రాముల బంగారం కరిగించి కాజేసినట్లు గుర్తించారు. దీంతో మోసపోయామని తెలుసుకున్న వారు కన్నీరుమున్నీరయ్యారు.బంగారం ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఇలాంటి మోసాలు, దొంగతనాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అపరిచితులు ఇంటికి వచ్చి ఆభరణాలు మెరిపిస్తామని, శుభ్రం చేస్తామని చెప్పినా ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని పోలీసులు సూచిస్తున్నారు.ఘటనపై సమాచారం అందుకున్న తొగుట పోలీసులు విచారణ చేపట్టి నిందితుల కోసం గాలిస్తున్నారు. మహిళలు అప్రమత్తంగా ఉండి విలువైన ఆభరణాలను అపరిచితుల చేతికి ఇవ్వవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## కేసీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి :ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

**ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తీవ్రంగా ఖండించారు. మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్రను ఎవరూ విస్మరించలేరని, అలాంటి నాయకుడిపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని అన్నారు.ప్రభుత్వ విప్ పదవిలో ఉన్న వ్యక్తి ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య సమన్వయం చేస్తూ అసెంబ్లీ నిర్వహణకు సహకరించాల్సి ఉంటుందని, కానీ ఆది శ్రీనివాస్ మాత్రం తన బాధ్యతలను పక్కనపెట్టి బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు.రాష్ట్రంలో రైతులు విత్తనాలు, యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారని, పండించిన పంటలకు సరైన ధర లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన బలాన్ని నిరూపించుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని అన్నారు. అధికార దుర్వినియోగం, ధనబలం, కండబలంతో రాజకీయాలు చేసినా ప్రజలు కాంగ్రెస్‌కు దూరమవుతున్నారని వ్యాఖ్యానించారు.కేసీఆర్ నాయకత్వాన్ని రాష్ట్ర ప్రజలు ఇప్పటికీ బలంగా కోరుకుంటున్నారని, ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్‌కు ఆదరణ పెరుగుతోందని తెలిపారు.

కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులపై విమర్శలు చేసే ముందు కాంగ్రెస్ నాయకులు తమ స్థాయిని గుర్తుంచుకోవాలని సూచించారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో కేసీఆర్ పాత్ర చారిత్రాత్మకమని, తెలంగాణ ప్రజలు ఆ విషయాన్ని ఎప్పటికీ మరవబోరని అన్నారు.




కేసీఆర్ లేకపోతే తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదే కాదని, నేడు కాంగ్రెస్ నాయకులు అనుభవిస్తున్న పదవులకు కూడా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కారణమని పేర్కొన్నారు.రానున్న రోజుల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు తగిన సమాధానం చెబుతారని, ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని కేపీ వివేకానంద్ ధీమా వ్యక్తం చేశారు.

## పేద ప్రజలకు అండగా మన చంద్ర ఫౌండేషన్

- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి డాక్టర్.ఏ. చంద్రప్రియ పరామర్శ
- వైద్యులతో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఫౌండేషన్ చైర్మన్

**ప్రజా వాయిస్/వికారాబాద్:** పేద ప్రజలకు అండగా నిలబడి,నిస్వార్ధ సేవే లక్ష్యంగా మన చంద్ర ఫౌండేషన్ ను స్థాపించడం జరిగిందని ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్.ఏ.చంద్ర ప్రియ పేర్కొన్నారు. అందులో భాగంగా వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం,దోర్నాల్ గ్రామానికి చెందిన టి.సత్తయ్య కారు ప్రమాదం బారిన పడి తలకు తీవ్ర గాయం కావడంతో హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స జరిగింది.అయితే విషయం తెలుసుకున్న మన చంద్ర ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్.ఏ.చంద్రప్రియ ఆసుపత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న సత్తయ్య ను పరామర్శించారు.అనంతరం వైద్యులతో మాట్లాడి అతడి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అతడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



# నిరుద్యోగ యువతకు సువర్ణవకాశం

- జూన్ 17 న మెగా జాబ్ మేళా
- ఉద్యోగం మీ లక్ష్యమైతే – అవకాశం మీ ముందే.
- 70కి పైగా కంపెనీలు... వేలాది ఉద్యోగ అవకాశాలు.
- "అవకాశాన్ని అందిపుచ్చుకోండి... విజయవంతమైన జీవితానికి నాంది పలకండి."
- సుధీర్ రామ్‌నాథ్ కేకన్ (ఐ.పి.ఎస్). ములుగు జిల్లా ఎస్పీ.



**ప్రజా వాయిస్; ములుగు జిల్లా./** గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించి వారి కుటుంబాల భవిష్యత్తును వెలుగులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ములుగు జిల్లా పరిపాలన యంత్రాంగం కలిసికట్టుగా "మెగా జాబ్ మేళా – 2026" జూన్ 17 న ఇంచెర్ల గ్రామం నందు గల ఏమ్.ఆర్. ఫంక్షన్ హాల్ నందు నిర్వహించబోతుంది. ఈ మెగా జాబ్ మేళాకు తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ సీతక్క ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ జాబ్ మేళాలో 70కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాయని, ఇంజినీరింగ్, టెక్నికల్, ఫార్మసీ, స్కిల్డ్ వర్క్, సర్వీస్, ఇతర పలు రంగాలకు సంబంధించిన ఉద్యోగాల కోసం నియామకాలు చేపట్టనున్నారు. ఇట్టి ఉద్యోగ అవకాశాలు హైదరాబాద్ వంటి మెట్రోపాలిటన్ సిటీ'లోనే కాకుండా ప్రాంతీయ జిల్లాలలో సైతం అవకాశాన్ని బట్టి కంపెనీలు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.

**ఉద్యోగ అర్హతలు:**

7వ తరగతి ఉత్తీర్ణులై , SSC, ఇంటర్మీడియట్, ITI, డిప్లొమా, డిగ్రీ మరియు సమాన అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిపాలన కోరుతోంది.

**అభ్యర్థులు తమతో పాటు:**

నూతన (ప్రస్తుత) బయోడేటా, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, ఇతర అవసరమైన పత్రాలుతప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. గ్రామీణ యువత తమ ప్రతిభను చాటుకునేందుకు, మంచి ఉద్యోగాన్ని సాధించి కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకునేందుకు ఇది ఒక అరుదైన అవకాశం అని అధికారులు తెలిపారు.

**మరిన్ని వివరాల కోసం:**

డీఎస్పీ ములుగు: 8712670103 సీఐ ములుగు: 8712670111 సంప్రదించగలరు.





# మందుబాబులకు అడ్డాగా మారిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

- ఏళ్లు గడుస్తున్న కేటాయింపు ప్రక్రియ కానరాలే
- కొత్తగూడెం నియోజకవర్గంలో ఎర్ర సూర్యుడికి కనిపించని పేదోడి సొంతింటి కల
- కేటాయింపు జరగకపోవడంతో చెదలు పడుతున్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లు
- పాలకులు ఎవరైనా డబల్ బెడ్ రూం అర్హులకు శాపమేనా
- అయ్యా కొత్తగూడెం ఎమ్మెల్యే గారు కేటాయింపు ప్రక్రియ ఇంకెన్నడు

**ప్రజా వాయిస్ కొత్తగూడెం నియోజకవర్గం** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం పాల్వంచ మండల రూరల్ పరిధిలోని దంతెలబోర ఎస్సీ కాలనీ గ్రామపంచాయతీ పరిధిలో గత బి.ఆర్.ఎస్, ప్రభుత్వం లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తయి ఏళ్లు గడిచి ప్రభుత్వాలు మారినా కూడా ఇండ్ల కేటాయింపు ప్రక్రియ ఏమాత్రం కదలడం లేదు. అర్హులైన పేదవాడికి చెందవలసిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నేడు మందు బాబులకు అడ్డాగా మారింది. కోట్ల రూపాయల విలువతో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇలా బూడిదలో పోసిన పన్నీరుల మిగిల్చారంటూ స్థానిక గ్రామ ప్రజలు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. నిర్మాణం పూర్తయిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించకపోవడంతో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిసరాల చుట్టూ కంప చెట్లు, గడ్డి, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.గత కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ప్రస్తుతం పశువులకు కొట్టాలుగా, పేకాటరాయులకు, మందుబాబులకు, చెడు వ్యసనాలకు పాల్పడేందుకు అడ్డాగా మారింది. ఈరోజు రేపు కేటాయింపు ప్రక్రియ ప్రారంభిస్తామంటూ గత పాలకులు, కాలం ఎల్లదీశారే తప్ప కేటాయింపు ప్రక్రియను ఏమాత్రం ప్రారంభించలేదంటూ స్థానిక గ్రామ ప్రజలు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు స్పందించి దంతేలబోర ఎస్సీ కాలనీ గ్రామపంచాయతీలో ఏళ్ల తరబడి చెదలు పట్టి పోతున్న డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు ప్రక్రియను ప్రారంభించవలసిందిగా స్థానిక గ్రామపంచాయతీ ప్రజలు వేడుకుంటున్నారు. అంతేకాకుండా పూర్తి స్థాయిలో ప్రతి గ్రామపంచాయతీలో రానున్న ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో నిజమైన అర్హులకే చెందే విధంగా కృషి చేస్తూ కొత్తగూడెం నియోజకవర్గానికి అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయించే విధంగా కృషి చేయాలంటూ స్థానిక గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు. కావున ఇకనైనా భద్రాద్రి జిల్లా కలెక్టర్ స్పందించి తక్షణమే చెదలు పట్టిపోతున్న పేదోడి సొంతింటి కలను ఇకనైనా సహకారం చేసుకునేందుకు తమ వంతుగా కృషిచేసి తక్షణమే అర్హుల జాబితాను సిద్ధం చేసి నిజమైన అర్హులకు డబల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించవలసిందిగా స్థానిక గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.



# ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?

- ఈదురుగాలులతో రహదారిపై పడిన చెట్టు
- వారం రోజులైనా తొలగించని వైనం
- ప్రజల ప్రాణాలతో చెలగాటమా అంటూ వాహన దారుల ఆందోళన.

**ప్రజా వాయిస్ / పెద్దేముల్:** పెద్దేముల్ మండలంలోని ఘాజీపూర్ గ్రామ శివారులోగల కోళ్ల ఫారం సమీపంలో గత వారం రోజుల క్రితం ఈదురుగాలులతో కూడిన వర్షానికి చెట్టు రహదారిపై కూలి పడింది. అయితే ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఆ చెట్టును తొలగించకపోవడం పట్ల వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగితే తప్ప అధికారులు, పాలకులు స్పందించరా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆశ్చర్యమేమిటంటేఈ రహదారి గుండా నిత్యం మండలాధికారులు, వివిధ శాఖల అధికారులు ప్రయాణం చేస్తూ ఉంటారు. అయినప్పటికీ కళ్లముందే ప్రమాదకర పరిస్థితి కనిపిస్తున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.రహదారిపై కూలిన చెట్టు కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడమే కాకుండా...ద్విచక్ర వాహనదారులు, రైతులు, సాధారణ ప్రజలు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు,వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారిందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నదని వాహనదారులు వాపోతున్నారు.రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగించి రహదారిని సురక్షితంగా మార్చాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు ,పాలకుల పైన ఉన్నప్పటికీ, ఇప్పటివరకు చర్యలు లేకపోవడం బాధాకరం అని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చెట్టును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆంజనేయస్వామి దేవాలయంలో సిసి కెమెరాలు ప్రారంభం

- నేరాల నియంత్రణ దేవాలయంలో భద్రత కు సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం
- కీసర సీఐ ఆంజనేయులు
- సిసి కెమెరాల దాత మేడ్చల్ జిల్లా జూనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వంగేటి బాపిరెడ్డి

**మేడ్చల్, కీసర / ప్రజా వాయిస్ :** మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రముఖ న్యాయవాది, మేడ్చల్ జిల్లా జూనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వంగేటి బాపిరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన సిసి టివి కెమెరాలను శనివారం కీసర ఇన్స్పెక్టర్ అర్కపల్లి ఆంజనేయులు, కీసర సెక్టార్ ఎస్ ఐ హరప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. దేవాలయ కమిటీ సభ్యులు సిసి కెమెరాల దాత మేడ్చల్ జిల్లా జూనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వంగేటి బాపిరెడ్డి కుటుంబసభ్యులను ఘనంగా సత్కరించారు. అనంతరం సిఐ అర్కపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ..... నేరాల నియంత్రణ, దేవాలయంలో భద్రత కు సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయమన్నారు. నిందితుల ను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఉపయోగప దుతాయని, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతతో సీసీ కెమోరాలు అందుబాటులోకీ వస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నేరాలను నియంత్రించేందుకు, అసాంఘికకార్యకలాపాలు జరగకుండా ప్రశాంతమైన వాతవరణం కల్పించడంలో సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రామాలయం చైర్మన్ రాయిల శ్రవణ్ కుమార్ గుప్తా, భక్త మండలి సభ్యులు తంగళ్ల పల్లి వెంకటేష్, జూపల్లి రవీందర్, మెట్టు మహేందర్ యాదవ్, పండుగ రామకృష్ణ, తటాకం భానుచందర్, మెట్టు సతీష్ యాదవ్,బండారు శ్రీనివాస్ రెడ్డి, చినింగని సుధాకర్, చంద్రశేఖర్ రెడ్డి,ఈనాడు రవి, వెంకట్ చారి తదితరులు పాల్గొన్నారు.




# యువకుడి భవిష్యత్తు దెబ్బతిందంటూ ఎస్ఐపై ఎస్పీకి ఫిర్యాదు

- రాజకీయ ఒత్తిళ్లకు లోబడి తన కుమారుడిపై ఎస్సై కేసు నమోదు చేశారంటూ తండ్రి ఆవేదన
- హత్యాయత్నం కేసు నమోదు వల్ల పోస్టల్ ఉద్యోగ ఇంటర్వ్యూకు దూరమైన యువకుడు
- కేసు నమోదు, దర్యాప్తుపై నిష్పాక్షిక విచారణ కోరుతూ ఎస్పీకి తండ్రి వినతి.




**ప్రజా వాయిస్ / పెద్దేముల్**/వికారాబాద్వికారాబాద్ జిల్లా, పెద్దేముల్ మండల పరిధిలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదం నేపథ్యంలో తన కుమారుడి భవిష్యత్తు దెబ్బతిందంటూ మంబాపూర్ గ్రామానికి చెందిన మర్పల్లి శ్రీనివాస్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ)కు శనివారం ఫిర్యాదు చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు లోబడి పెద్దేముల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ తన కుమారుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారని ఆయన ఆరోపించారు. బాధితుడు మర్పల్లి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 2న మంబాపూర్ గ్రామానికి చెందిన మర్పల్లి అనిర్వేష్ (20) స్కూటీపై గ్రామంలో వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన బుల్లెట్ మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ కిందపడగా, బుల్లెట్ నడుపుతున్న జాఫర్‌కు చేతికి స్వల్ప ఫ్రాక్చర్ అయినట్లు తెలిపారు.ఈ ఘటనకు సంబంధించి జాఫర్ సోదరుడు మోహిజ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టకుండా అనిర్వేష్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇది పూర్తిగా ప్రమాదవశాత్తు జరిగిన సంఘటన మాత్రమేనని, ఎలాంటి దురుద్దేశం లేదని వివరించినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదని వారు వాపోతున్నారు.ఈ కేసులో అనిర్వేష్‌ను ఈ నెల 8న రిమాండ్‌కు పంపడంతో, మరుసటి రోజు నిర్వహించాల్సిన పోస్టల్ శాఖ ఉద్యోగ ఇంటర్వ్యూకు హాజరుకాలేకపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగ అవకాశం కోల్పోవడంతో పాటు అతని భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు గాయపడిన జాఫర్, ఫిర్యాదుదారుడు మోహిజ్ మరియు వారి కుటుంబ సభ్యులు కూడా ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందని, ఎలాంటి హత్యాయత్నం జరగలేదని చెబుతున్నారని మర్పల్లి శ్రీనివాస్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అవసరమైతే వారిని అధికారుల ఎదుట హాజరుపరచడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.పెద్దేముల్ ఎస్ఐ వ్యవహారశైలి, కేసు నమోదు విధానం, దర్యాప్తు మరియు రిమాండ్ ప్రక్రియపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని ఎస్పీని కోరారు. హత్యాయత్నం కేసు నమోదు వెనుక వాస్తవాలను వెలికితీయడంతో పాటు విధి నిర్వహణలో లోపాలు లేదా అధికార దుర్వినియోగం జరిగి ఉంటే సంబంధిత అధికారిపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ ఘటన ప్రస్తుతం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఒక సాధారణ రోడ్డు ప్రమాదం కేసు కారణంగా యువకుడి ఉద్యోగ అవకాశం కోల్పోవడం, భవిష్యత్తు అనిశ్చితిలో పడటం పట్ల కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




# నీట్ పునఃపరీక్ష పై తల్లిదండ్రుల ఆవేదన

- పరీక్షా కేంద్రాల్లో పని చేసే సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇవ్వాలి
- ఇన్విజిలేటర్ల నిర్లక్ష్య వైఖరితో విద్యార్థులను ఆందోళనకు గురి చేయరాదు
- కష్టపడి చదివి పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులను కష్ట పెట్టొద్దు
- పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి

**ప్రజా వాయిస్/వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** నీట్ పునఃపరీక్ష నిర్వహణ నేపథ్యంలో ఇప్పటివరకు ఎన్‌టీఏ చేసిన తప్పిదాల పై మాత్రమే చర్చ జరిగిందని, అయితే ఈసారి రీ–ఎగ్జామ్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పగడ్బందీ ఏర్పాట్లతో నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల్లో పనిచేసే సిబ్బందికి కూడా సమగ్ర శిక్షణ ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.ఇటీవల జరిగిన నీట్ పరీక్షలో కొందరు ఇన్విజిలేటర్ల నిర్లక్ష్యం వల్ల ఓఎంఆర్ షీట్లపై వైట్నర్, చాక్‌పీస్ ఉపయోగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాగే పరీక్షా పత్రాలు, ఓఎంఆర్ షీట్లు సరైన క్రమంలో పంపిణీ చేయకపోవడం వల్ల విద్యార్థులు హాల్ టికెట్ నంబర్లు నమోదు చేసిన తర్వాత వాటిని తిరిగి తీసుకుని మార్చడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో చాక్‌పీస్‌తో దిద్దుబాట్లు చేయించి విద్యార్థులను అనవసర ఆందోళనకు గురిచేశారు.విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎన్నో నెలలు కష్టపడి చదివి పరీక్ష రాయడానికి వస్తారు. అలాంటి సమయంలో కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వారి భవిష్యత్తు ప్రమాదంలో పడకూడదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అందువల్ల ఎన్‌టీఏ అధికారులు పరీక్షా కేంద్రాల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, సిబ్బంది, ఇన్విజిలేటర్లను నియమించి, వారికి ముందస్తు శిక్షణ ఇచ్చి, ఎలాంటి పొరపాట్లు జరగకుండా పరీక్షలను పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పాఠశాలలు, కళాశాలల సమీపంలో పాన్ డబ్బాలు తొలగించాలి

- వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్


**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** ఉమ్మడి మహానగరం పాలక సంస్థ మరియు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పాఠశాలలు కళాశాలల సమీపంలో పాన్ డబ్బాలు నిర్వహించరాదని వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్ ఆదేశించారు విద్యాసంస్థల ఏరియాలో మత్తు పాను గుట్కాలు, గంజావిక్రయాల వలన విద్యార్థులు చెడు అలవాట్లకు గురై కుటుంబాలు అల్లకల్లోలం అయ్యే పరిస్థితి ఉన్నందువలన ఈ ప్రమాదం నుండి తప్పించడానికి కఠిన నిబంధనలు విధించామని నిబంధనలు ఉల్లంఘించిన వారినీ చట్టపరంగా శిక్షిస్తామని తెలిపిన వరంగల్ సిపి.



# వీకెండ్ విహారయాత్రలో విషాదం

- నాగార్జునసాగర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- మహిళ మృతి, భర్త పరిస్థితి విషమం
- పైలాన్ కాలనీ సమీపంలో స్విఫ్ట్ డిజైర్–థార్ వాహనాల ఢీ
- ఘటనాస్థలంలోనే మహిళ మృతి
- తీవ్ర గాయాలతో భర్త ఆసుపత్రికి తరలింపు
- ప్రమాద తీవ్రతతో షాక్‌లోకి వెళ్లిన బాధితుడు కమలా నెహ్రూ
- ఆసుపత్రిలో అత్యవసర చికిత్స
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు





**నల్గొండ క్రైమ్ / ప్రజా వాయిస్:**నాగార్జునసాగర్‌లో శనివారం ఉదయం చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వీకెండ్ సందర్భంగా విహారయాత్రకు వచ్చిన దంపతులు ప్రమాదానికి గురికావడంతో భార్య ప్రాణాలు కోల్పోగా, భర్త తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.విజయపురి టౌన్ ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌కు చెందిన పాలపర్తి శ్రీనివాసరావు (66), ఆయన భార్య కాత్యాయని (55) శనివారం ఉదయం స్విఫ్ట్ డిజైర్ కారులో ప్రయాణిస్తుండగా, నాగార్జునసాగర్ పైలాన్ కాలనీ శ్మశానవాటిక సమీపంలో ఎదురుగా వస్తున్న మహీంద్రా థార్ వాహనంతో బలంగా ఢీకొట్టింది.ప్రమాదం తీవ్రతకు స్విఫ్ట్ డిజైర్ కారు పూర్తిగా ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న కాత్యాయని తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న విజయపురి టౌన్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.గాయపడిన శ్రీనివాసరావును అత్యవసరంగా నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని కమలా నెహ్రూ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నారని, ప్రమాద తీవ్రత కారణంగా తీవ్ర షాక్‌కు గురై మాట్లాడలేని స్థితిలో ఉన్నట్లు వైద్యులు తెలిపారు.మృతురాలు కాత్యాయని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.సేదతీరేందుకు వచ్చిన దంపతులకు మృత్యుఘంటికవీకెండ్‌ను ఆనందంగా గడపాలన్న ఆశతో నాగార్జునసాగర్‌కు వచ్చిన దంపతులకు ఈ ప్రమాదం విషాదాంతంగా మారింది. ఒక్క క్షణంలో జరిగిన ప్రమాదం ఒక కుటుంబాన్ని దుఃఖసాగరంలో ముంచేసింది.



# చిన్నారిపై దారుణానికి కలిచివేసిన స్పందన

- నిమ్స్ లో బాధితురాలిని పరామర్శించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ఖమ్మం రాపర్తి నగర్ ఘటనపై ఆవేదన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే
- బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేత
- నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ
- ప్రభుత్వ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా
- చికిత్స పొందుతున్న చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా



**హైదరాబాద్/షాద్‌నగర్, ప్రజా వాయిస్:** ఖమ్మం పట్టణంలోని రాపర్తి నగర్‌లో మైనర్ బాలికపై జరిగిన దారుణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారితీసిన నేపథ్యంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పందించారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలికను ఆయన పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.జూన్ 6న ఖమ్మంలోని రాపర్తి నగర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనలో స్థానికంగా డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తి మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలు ప్రతిఘటించడంతో నిందితుడు ఆమెను భవనం పైకప్పు నుంచి కిందకు తోసివేసినట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక స్పృహలోకి వచ్చిన తర్వాత జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు వివరించడంతో అసలు ఘటన బయటపడింది.ఈ సందర్భంగా మాట్లాడిన వీర్లపల్లి శంకర్, చిన్నారిపై జరిగిన దారుణం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వంతో పాటు పోలీసు అధికారులతో మాట్లాడతామని తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన నాయకులు సంపత్ కుమార్, ఎన్. రాజు, ఎం.ఎన్. రావు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలే ప్రధాన బలం

- సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామాల్లో విస్తృతంగా నిర్వహించాలి
- ఎస్ ఐఆర్ ఓటరు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- బూత్ స్థాయిలో నాయకులు చురుకుగా పనిచేయాలని సూచన
- హాలియాలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు
- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్




**ప్రజా వాయిస్ / హాలియా** నాగార్జునసాగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించడం, బూత్ స్థాయి బాధ్యతలపై స్పష్టత తీసుకురావడం లక్ష్యంగా గుర్రంపోడ్ మండలంలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నోముల భగత్ కుమార్ మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధికి కార్యకర్తలే ప్రధాన బలమని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి, పార్టీ కార్యకర్తలు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అందరూ సమిష్టిగా పనిచేయాలని కోరారు.ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా కృషి చేయాలని ఆయన అన్నారు. ఓటరు జాబితాల సవరణ, పరిశీలన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.బూత్ స్థాయి కార్యకర్తలు, బి ఎల్ ఏలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల పరంగా పార్టీని మరింత బలోపేతం చేయడంలో ప్రతి నాయకుడు కీలక పాత్ర పోషించాలని అన్నారు.అదేవిధంగా జూన్ 16న హాలియా పట్టణంలోని లక్ష్మీనర్సింహ గార్డెన్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ ఓటరు నమోదు కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్సీ కోటి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి భారీ ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# తండ్రి ఆస్తిలో తన వాటా ఇవ్వకుండా మోసం చేశారని మహిళ ఆరోపణ

- భూమి అభివృద్ధి పేరుతో సంతకాలు తీసుకుని మోసం చేశారని ఆరోపణ
- రూ.80 లక్షలు, 8 ప్లాట్లు ఇస్తామని చెప్పి మాట తప్పారని వేదన
- తమ కుటుంబానికి ప్రాణహాని ఉందంటూ ప్రభుత్వాన్ని ఆశ్రయించిన బాధితురాలు
- సీఎం, మంత్రి, ఎమ్మెల్యే జోక్యం చేసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి




**హైదరాబాద్ / ప్రజా వాయిస్:** యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన పలుగుల శ్రీవాణి తన తండ్రి ఆస్తిలో తనకు రావాల్సిన వాటా విషయంలో అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తన కుమార్తె, అల్లుడితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తన తండ్రి పట్నం యాదగిరికి చెందిన సర్వే నంబర్లు 211, 213, 217లలో ఉన్న భూమిలో తనకు రెండున్నర ఎకరాల వాటా రావాల్సి ఉందన్నారు. భూమి అభివృద్ధి పేరుతో తన మామ, భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ పోతన్‌శెట్టి వెంకటేశ్వర్లు తనను నమ్మించి పలు పత్రాలపై సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. తనకు రూ.80 లక్షలు, 8 ప్లాట్లు ఇస్తామని హామీ ఇచ్చి అన్ని రకాల డాక్యుమెంట్లపై సంతకాలు తీసుకున్నారని, అనంతరం ప్రజ్ఞా సెంట్రల్ పార్క్ కంపెనీ పేరుతో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకుని ప్లాట్లు విక్రయిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు తనకు ఇవ్వాల్సిన డబ్బు, ప్లాట్లు ఇవ్వలేదని తెలిపారు.తాను పలుమార్లు వేడుకున్నప్పటికీ కనికరించకుండా, “మీకు గజం భూమి కూడా ఇవ్వను.. దిక్కున్న చోట చెప్పుకోండి” అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రి ఆస్తిలో తనకు హక్కు లేదా అని ప్రశ్నించారు.ఈ వివాదంతో తీవ్ర మనస్తాపానికి గురై మున్సిపల్ ఎన్నికలకు ముందు పోతన్‌శెట్టి వెంకటేశ్వర్లు ఇంటి ముందు ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిపారు. ఆ సమయంలో ఎమ్మెల్సీ తీన్‌మార్ మల్లన్న సమక్షంలో ఎన్నికలు పూర్తయ్యాక తన వాటా ఇస్తానని హామీ ఇచ్చారని, ఆ మాట నమ్మి ఇప్పటి వరకు వేచి చూశామని చెప్పారు.అయితే ఎన్నికల అనంతరం తనకు మున్సిపల్ చైర్మన్ పదవి రాకపోవడానికి మీరే కారణమంటూ ఒక్క ప్లాట్ కూడా ఇవ్వబోనని తిరిగి బెదిరించారని ఆరోపించారు. ఇటీవల తనపై, తన అల్లుడు సాయికుమార్, కుమార్తె అనూహ్యపై భువనగిరి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయించారని తెలిపారు.అంతేకాకుండా తాము నిశ్శబ్దంగా లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారని, తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని చెప్పారు. ఇప్పటికే కొంతమంది అనుమానాస్పద వ్యక్తులు తమ ఇంటి పరిసరాల్లో తిరుగుతున్నారని, భద్రత కల్పించి న్యాయం చేయాలని కోరారు.ఈ విషయంపై భువనగిరి ఎమ్మెల్యే, సంబంధిత మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని తనకు రావాల్సిన హక్కులను కల్పించాలని పలుగుల శ్రీవాణి మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.గమనిక: పై ఆరోపణలు బాధితురాలు పలుగుల శ్రీవాణి మీడియా సమావేశంలో చేసిన ప్రకటనల ఆధారంగా ప్రచురించబడినవి. ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల స్పందన అందాల్సి ఉంది.





# మైనింగ్ రెవెన్యూ కనుసన్నల్లో మట్టి కాసుల పంట

**ప్రజా వాయిస్/ జైపూర్** జైపూర్ మండలం మట్టి దందా ప్రభుత్వ యంత్రాంగానికి పట్టడం లేదెందుకు..? అక్రమ మట్టి తరలింపుపై గ్రామస్తులు ఆగ్రహం చేస్తే తప్ప మట్టి తరలింపు ఆగడం లేదంటే మైనింగ్, రెవెన్యూ అధికారులు మరేం చేస్తున్నట్లు..? ఇరిగేషన్, మైనింగ్ అధికారులు లెటర్ల మీద లెటర్లు జారీ చేస్తూ మట్టి బొక్కండని అనుమతులు ఇస్తే అది ఏ విధంగా తీసుకెళు న్నారు నిబంధనలు పాటిస్తున్నారా. లేదా అనే అంశాన్ని రెవెన్యూ శాఖ ఎందుకని పట్టించుకోవడం లేదు కొన్ని రోజులుగా పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇష్టారాజ్యంగా మట్టిని తోడేసుకు పోతుంటే.. అధికారులు కేవలం షరా'మామూలు' గానే తీసుకుంటారా. అనేఅభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.మండలంలో మట్టి మాఫియా చెరువులను భూమి కొల్లగొడుతూ అక్రమంగా మట్టిని జోరుగా తరలిస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. తమ కళ్లెదుట నుంచి మట్టి లారీలు వెళుతున్నా కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎక్కడికక్కడ ఆయా విభాగాల అధికారులను మేనేజ్ చేసుకుని మట్టి మాఫియా రాత్రనకా, పగలనకా మట్టి దందాను కొనసాగిస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నట్లుగా కనబడుతున్నది. కొందరు ఇదే పనిగా రాజకీయ పార్టీల నాయకుల అండదండలతో దందాను కొనసాగిస్తున్నారు. గ్రామస్తులు అడ్డుకుంటున్నారని నామమాత్రంగా తీసుకువచ్చి మట్టిని తరలిస్తున్నారు. వందల టన్నుల్లో అనుమతులు తీసుకుని వేల టన్నుల్లో మట్టిని తరలిస్తున్నారు. మట్టి మాఫియాకు జిల్లా అధికారులు పూర్తి స్థాయిలో సహకరిస్తున్న కారణంగానే వారి దందా యథేచ్ఛగా సాగుతున్నది. జైపూర్ మండలం గ్రామల పరిధిలోని జిల్లా గనులు, భూగర్భ శాఖ అనుమతులు ఇచ్చారు. అదే రోజు నుంచి వరకు మట్టిని తరలించుకునేందుకు గడువు ఇచ్చారు. అయితే పర్మిట్ పేరిట 25 నుంచి 30 టన్నుల సామర్థ్యం గల లారీలు, టిప్పర్లలో రోజుకు వెయ్యి టన్నుల చొప్పున మట్టిని తరలిస్తున్నారు మంచిర్యాల్ రాఘవపూర్ మట్టి ఇటుకలకు. వాస్తవానికి ప్రభుత్వ భూముల్లో తీసే మట్టిని ప్రభుత్వ అవసరాల కోసం మాత్రమే తరలించేందుకు అనుమతి ఇవ్వాలి. కానీ మట్టి దందా చేసే , ఇతర ఇటుక బట్టి నిర్మాణాల కోసం, ఇతరత్రా ప్రైవేట్ అవసరాలకు మట్టిని విక్రయించుకుంటున్నారు. ఒక్కో లారీకి దూరాన్ని బట్టి 8 వేల నుంచి 15 వేల రూపాయల వరకు విక్రయిస్తున్నారని సమాచారం. గనులు, భూగర్భ శాఖాధికారులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు ఎవరు కూడా మట్టితో తరలుతున్న లారీలు, టిప్పర్లను పట్టుకో కుండా తమ పలుకుబడిని ఉపయోగిస్తు న్నట్లు తెలుస్తున్నది. పాలితంలో చెరువు మట్టి కోసం తీసుకున్న అనుమతులు వచ్చినప్పటి నుండి టన్నుల తక్కువ గాకుండా అక్రమంగా మట్టిని తరలించినట్లు కనబడు తున్నది. పర్మిట్ కాలపరిమితి పూర్తయినా కూడా ఈ నెలలో కూడా ఇంకా మట్టిని తరలి స్తూనే ఉన్నారు. ఒక టన్నుకు ప్రభుత్వానికి ఇంత చొప్పున సీనరేజీ చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు పాలితం చెరువుల నుంచి టన్నులకు పైగా మట్టిని అక్రమంగా తరలించి ప్రభుత్వాదాయానికి లక్షల రూపాయల వరకు గండి కొట్టినట్లుగా తెలుస్తున్నది. ప్రభుత్వానికి చెల్లించేది స్వల్పమే అయినా దానిని కూడా మట్టి మాఫియా ఎగ్గొట్టి లక్షలాది రూపాయలు అనతి కాలంలోనే ఆర్జిస్తున్నారు. పాలితం నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న విషయాన్ని గమనించిన గ్రామస్తులు శుక్రవారం మట్టి టిప్పర్లను అడ్డుకున్నారు. మట్టి తరలింపునకు సంబంధించి అను మతులు చూపలేదని తెలిసింది. అంతేగాకుండా వారం తా అక్రమ మట్టి దందాను నిలవరింపజేయాలని, ఇప్పటి వరకు నిర్ణీత ప్రదేశం నుంచి ఎంత మొత్తంలో మట్టిని తరలించుకుపోయారో ఎలక్ట్రానిక్ యంత్రం ద్వారా లెక్కించి సీనరేజీ సొమ్మును వసూలు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఒక్క పాలితంలోనే గాకుండా వివిధ ప్రాంతాల్లో కూడా అక్రమంగా మట్టి దందా కొనసాగుతున్నది. ఈ విషయమై కలెక్టర్ స్పందించి అక్రమ మట్టి దందాను నిలువరించాలని ప్రజలు కోరుతున్నారు.

# జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడిగా శ్రీధర్



**ప్రజా వాయిస్, పాపన్నపేట** మెదక్ జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడిగా కుర్తి వాడ గ్రామ సర్పంచ్ చెట్టుకింది శ్రీధర్ నియమితులయ్యారు. శనివారం కుర్తివాడలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ చేతుల మీదుగా శనివారం శ్రీధర్కు నియామక పత్రాన్ని అందజేశారు. సర్పంచుల సమస్యల పరిష్కారానికి శ్రీధర్ కృషి చేస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, మరియు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు




# తాండూరులో 'మాస్ ఎంకన్న' లీలలు..

- కరీంనగర్, మానకొండూరు ప్రజల కన్నీళ్ల గాథ!
- నకిలీ హామీలతో బురిడీ.. దౌర్జన్యాలతో దందా!

**ప్రజా వాయిస్ తాండూరు**/ బెల్లంపల్లి.మంచిర్యాల జిల్లా తాండూరు మండల కేంద్రంలో ఇప్పుడు 'అక్రమ' రాజ్యమేలుతోంది. అధికార పార్టీ అండ చూసుకుని.. కొందరు నేతలు సాగిస్తున్న భూకబ్జాల పర్వం ఒక్కొక్కటిగా బయటపడుతోంది. ఇందులో ప్రధాన పాత్ర.. అందరూ 'మాస్ ఎంకన్న' అని పిలుచుకునే ఆ నేతది,కరీంనగర్ నుంచి మానకొండూరు వరకు.. అమాయక ప్రజల ఆస్తులే లక్ష్యంగా, ల్యాండ్ సెటిల్మెంట్ల పేరుతో సాగిస్తున్న ఈ దందా ఇప్పుడు సంచలనం రేపుతోంది. నమ్మకం కలిగించడానికి బాండ్ పేపర్లు ఇచ్చారు.. బ్యాంక్ చెక్కులతో మభ్యపెట్టారు.. అమాయకుల దగ్గర లక్షలాది రూపాయలు వసూలు చేసి, చివరికి నిలువునా ముంచేశారు,అడ్డుపెట్టుకుని, సదరు నేతలు దౌర్జన్యాలకు దిగుతున్నారు. బాధితులు న్యాయం కోసం వెళ్తే.. వారికి దక్కాల్సింది న్యాయం కాదు, బెదిరింపులు! తమను నట్టేట ముంచిన 'మాస్ ఎంకన్న' అండ్ టీమ్ అరాచకాలపై బాధితులు ఇప్పుడు ఆవేదన చెందుతున్నారు.అక్రమార్కుల ఆడియోలు.. దౌర్జన్యాల వీడియోలు.. కబ్జాల ఆధారాలతోఅధికార పార్టీ ముసుగులో.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఈ అక్రమ దందాను బట్టబయలు చేసే సమయం ఆసన్నమైంది. అక్రమార్కుల గుండెల్లో గుబులు పుట్టించే బాధితుల కన్నీళ్లకు అండగా నిలిచే వారు ఎవరైనా రాకపోరా అని బాదితులు వాపోతున్నారు.

# బాధితులకు భరోసా కల్పించడమే పోలీసుల ధ్యేయం

- నెలవారీ సమీక్షా సమావేశంలో ఎస్పీ నరసింహ

**ప్రజా వాయిస్,సూర్యాపేట:**బాధితులకు తక్షణ భరోసా, భద్రత కల్పించడమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని జిల్లా ఎస్పీ నరసింహ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డితో కలిసి నిర్వహించిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, పెండింగ్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై పటిష్ట నిఘా ఉంచాలని, డోర్‌స్టెప్ ఎఫ్ఐఆర్‌ను సమర్థంగా అమలు చేయాలని సూచించారు. కేసుల ఛేదనలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పక్కా సాక్ష్యాధారాలు సేకరించాలని చెప్పారు.సీసీ కెమెరాల ఏర్పాటు, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ మోసాలపై అవగాహన, మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ప్రత్యేక విభాగాల అధికారులు పాల్గొన్నారు.








# జీపీఎల్ ఫైనల్‌కు గ్రాండ్ ఫినిష్

- నూకల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవంతంగా జీపీఎల్ సీజన్-02 నిర్వహణ
- ఫైనల్ మ్యాచ్ అనంతరం విజేతలు, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందించిన ఎమ్మెల్యే
- గ్రామీణ ప్రతిభను వెలికితీసే వేదికలుగా క్రికెట్ టోర్నమెంట్లు
- క్రీడలతో పాటు విద్యలోనూ రాణించాలని యువతకు పిలుపు
- క్రీడలు యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజా వాయిస్,మిర్యాలగూడ**.మిర్యాలగూడ పట్టణంలోని గౌట్ జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో బి ఎల్ ఆర్ & ఎన్ వి ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నూకల చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన జీపీఎల్ సీజన్-02 క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఫైనల్ మ్యాచ్ అనంతరం విజేతలు, రన్నరప్ జట్లకు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బి ఎల్ ఆర్) బహుమతులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.యువత క్రీడలతో పాటు విద్యలోనూ ప్రతిభ కనబరిచి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలి అలవడటంతో పాటు యువతలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు.టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నూకల చారిటబుల్ ట్రస్ట్, బి ఎల్ ఆర్ & ఎన్ వి ఆర్ బ్రదర్స్ సభ్యులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఫైనల్ మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లను ప్రశంసిస్తూ విజేతలు, రన్నరప్ జట్లకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, యువజన నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని టోర్నమెంట్ విజయాన్ని ఆనందంగా జరుపుకున్నారు.



## ఖబడ్దార్..!

# పేదల ఉసురు ఊరికే పోదు

- కనకమామిడిలో ఉద్రిక్తత
- పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నం
- అన్యాయాన్ని ప్రశ్నించేందుకు యువకులంతా ఏకమవ్వాలి
- పేదల ఇండ్లు కూల్చాడానికే సర్పంచ్ గా గెలిచారా..?
- తహసీల్దార్, సర్పంచ్ భర్త తీరుపై మాజీ ఎమ్మెల్యే కే.ఎస్. రత్నం ఆగ్రహం
- కోట్ల భూముల కబ్జాలు కనిపించవా.. పేదల ఇండ్లే కనిపిస్తున్నాయా?
- కనకమామిడి కమ్మని చరిత్రను రాజకీయాలతో కలుషితం చేయొద్దని హెచ్చరిక
- పేదలకు అండగా బీజేపీ ఉంటుందని మాజీఎమ్మెల్యే భరోసా

**చేవెళ్ల (ప్రజా వాయిస్ ):**కనకమామిడి గ్రామంలో పేదల గుండెల్లో మంట రాజేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా పేదలు కష్టపడి కట్టుకున్న ఇండ్లపై కూల్చివేత చర్యలకు అధికారుల శ్రీకారంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. తమ గూడు పోతుందనే భయంతో బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరయ్యాయి.ఈ విషయం తెలుసుకున్న చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కే.ఎస్. రత్నం శనివారం ఉదయమే గ్రామానికి చేరుకుని బాధితులకు అండగా నిలిచారు. గ్రామంలో కోట్ల విలువ చేసే భూములు కబ్జా అయితే పట్టించుకోరు... కానీ పేదల ఇండ్లే కనిపిస్తున్నాయా? పేదలపైనే ప్రతాపం చూపించడం ఎందుకు? అంటూ అధికారులపై,ఇటు సర్పంచ్ భర్తపై తీవ్రంగా మండిపడ్డారు. అధికారులు,కొంతమంది కుట్రదారుల చర్యలతో మనస్తాపానికి గురైన కొందరు బాధితులు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా, స్థానికులు అడ్డుకోవడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై ఆవేదన వ్యక్తం చేసిన రత్నం, వెంటనే ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడి ఎలాంటి ఏకపక్ష చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేశారు.రోడ్డు ఆక్రమణల పేరుతో కేవలం పేదలనే టార్గెట్ చేయడం వెనుక కుట్ర ఉందని ఆరోపించిన ఆయన, "పేదల కన్నీళ్లు ఊరికే పోవు... వారి శాపం తగిలితే ఎవ్వరూ బాగుపడరు. గుడిసెలు కూల్చడం సులభమే... కానీ పేదల గుండెల్లో పడ్డ మంటను ఆర్పడం ఎవరి వల్ల కాదు" అని హెచ్చరించారు.కనకమామిడి గ్రామానికి ఉన్న మంచి పేరును రాజకీయాల కోసం మంటగలపొద్దని, పేదల గూళ్లపై దాడి చేసే వారిని గ్రామ ప్రజలు క్షమించరని అన్నారు. ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు గ్రామస్తులంతా ఒక్కటిగా నిలవాలని పిలుపునిచ్చారు.పేదవాడి ఇల్లు కూలితే నాలుగు గోడలు మాత్రమే కూలవు... ఒక కుటుంబం ఆశలు, కలలు, భవిష్యత్తు కూడా కూలిపోతాయి. పేదల ఉసురు తగిలితే అది ఊరికే పోదు అంటూ కే.ఎస్. రత్నం ఘాటుగా హెచ్చరించారు. పేదలకు అన్యాయం జరిగితే అండగా నిలిచేది తామేనని, అవసరమైతే పోరాటానికి కూడా సిద్ధమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ శ్రేణులు, గ్రామస్తులు, తదితరులున్నారు.



# కాసులు ఇస్తే గాని కదలని ఫైల్

- సమస్య చిన్నదైనా డబ్బులు కావాల్సిందే
- లేదంటే నెలలు గడిచిన అందని సర్టిఫికెట్
- ఇది అందోల్ రెవెన్యూ డివిజనల్ కార్యాలయ సిబ్బంది పనితీరు



**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** సాక్షాత్తు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రతినిత్యం వహిస్తున్న నియోజకవర్గం డివిజన్ కేంద్రం. ఇక్కడ సిబ్బంది పనితీరు వేరు... ఏదైనా పని కావాలంటే ముందు డబ్బులు కావాలి.... చిన్న సమస్య అయినా చేతులు తడపందే ఫైలు కదలదు... దానికి తోడు గత కొంతకాలంగా ఆర్డీఓ గా పనిచేసిన పాండు డిఆర్ఓ గా పదోన్నతి పై వెళ్లడంతో ఇక వీరి ఆటలకు అడ్డే లేకుండా పోయింది. చిత్రం ఏమిటంటే కార్యాలయానికి ఎప్పుడు ఎవరు వస్తారో ఎప్పుడు పోతారు కూడా సిబ్బంది పనితీరు ఉంది. ఆర్డీవో కార్యాలయం మనది మనకి ఎవరు అవుతారు అనుకుంటారేమో ఇష్టానుసారంగా సమయపాలన పాటించకుండా వచ్చి వెళుతుంటారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉండగా అందుల్ నియోజకవర్గానికి రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మెదక్ ఉండేది. ఈ నియోజకవర్గ సంబంధించిన పూర్తి రెవెన్యూ రికార్డులు మెదక్ ఆర్డీవో కార్యాలయంలో ఉన్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడడంతో పాటు పరిపాలన సౌలభం కోసం కొత్త రెవెన్యూ డివిజన్ కేంద్రాలను ఏర్పాటు చేసింది గత బిఆర్ఎస్ ప్రభుత్వం. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఇకమీదట మెదక్కోవలసిన పనిలేదు జోగిపేటలోనే అయిపోతుందనుకున్నారు. కానీ ఇప్పటికీ కొన్ని రెవెన్యూ రికార్డుల మెదక్లు ఆర్డీవో కార్యాలయంలో ఉన్నాయని.. మీరు కోరిన సర్టిఫికెట్ కావాలంటే కొంత సమయం ఇవ్వాలి.... దాంతోపాటు మెదక్ వెళ్లి వచ్చేందుకు ఖర్చులు కావాలంటూ నిర్మొలమట్టంగా సిబ్బంది అడుగుతున్నారు. నిదర్శనమే గత నెలలో అందోల్ మండలంలోని తాకూర్ గ్రామానికి చెందిన ఓ రైతు ఇనం పట్టా సర్టిఫికెట్ కోసం ఉన్న పట్ట చేసుకోవడం కోసం ఆర్డీవో ద్వారా ప్రతిపాదన అవసరం ఉంటుంది. దీనికోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ కార్యాలయంలోని పెండింగ్ చూపెడుతున్నారు. ఇందుకు ఆర్డిఓ కార్యాలయం నుంచి సర్టిఫైడ్ కాపీ ( ట్రూ కాపీ ) వస్తే కానీ తామేం చేయలేమంటూ తాసిల్దార్ వివరించారు. కానీ సర్టిఫై చేయడం కోసం సుమారు 40 రోజులు పడుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే గ్రామానికి చెందిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇదే సమస్యను వారం రోజులు తిరగకుండానే పని చేయించుకుంటున్నారు. ఎందుకంటే వారు అడిగినంత డబ్బులు ఇస్తారు.... నిత్యం సిబ్బందితో లావాదేవీలు జరుగుతూ ఉంటాయి కాబట్టి వారికి అడిగిన వెంటనే పనులు చేస్తారు. సామాన్య రైతుకు పరిచయాలు ఉండకపోవడంతో సర్టిఫికెట్ కోసం 42 రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. ఇదే కాదు డిఎస్ పెండింగ్ ఫైల్ అని ఆన్లైన్లో ఒకటి ఉంటుంది. ఇది గతంలో సర్వే నెంబర్లు పట్టా భూమిలో ఉన్నప్పటికీ ఆన్లైన్లో చేపించకపోవడంతో వాటిని సరి చేయడం కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటారు. వీటిని ఆర్డిఓ డిఎస్ పెండింగ్ అప్లోడ్ కొడితే కానీ మిస్సయిన సర్వే నంబర్లు తిరిగి ఆడ్ అయ్యే అవకాశం లేదు. దీనికి ఒక్కొక్క ఎకరాకు ఒక రేటు.... పట్టణ ప్రాంతానికి ఒకటి మారుమూల గ్రామాలకు ఒకరేటు చొప్పున సిబ్బంది వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా కొత్తగా వచ్చిన ఆర్డిఓ రమేష్ బాబు అయినా సిబ్బంది పని తీరును మార్చవలసిన అవసరం ఉంది. డబ్బులు ఇవ్వందే పని జరగడం లేదనేది బహిరంగ సత్యం. కొంతమేరకైనా మార్పు చేస్తారని ఆశ.



# జాంబవంతుని గుడి స్థలంపై కన్నేస్తే ఉద్యమం తప్పదు

- అక్రమ నిర్మాణాలు వెంటనే తొలగించాలి
- దళిత సంఘాల హెచ్చరిక

**ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్ జగద్గిరిగుట్ట డివిజన్:** జగద్గిరిగుట్టలోని జాంబవంతుని గుడి స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడాన్ని దళిత సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. జాంబవంతుని గుడి స్థలాన్ని పరిరక్షించుకునేందుకు అన్ని దళిత సంఘాలు ఐక్యంగా పోరాటం చేస్తాయని హెచ్చరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జాంబవంతుని గుడి స్థలాన్ని కొందరు అక్రమంగా అమ్ముకుని నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులను కలిసి అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని కోరినట్లు తెలిపారు.గతంలో ఇదే స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారని, అయినప్పటికీ మళ్లీ మళ్లీ నిర్మాణాలు చేపడుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇకపై ఇలాంటి చర్యలను సహించబోమని, స్థల పరిరక్షణ కోసం దళిత సంఘాలు ఉమ్మడిగా ఉద్యమం చేపడతాయని స్పష్టం చేశారు.రెవెన్యూ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జాంబవంతుని గుడి స్థలాన్ని అమ్ముకునేందుకు లేదా ఆక్రమించేందుకు ప్రయత్నించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు దొరవి బాబు, రాములు, ఎంఆర్పీఎస్ నాయకులు అల్వాల భాస్కర్, ఆర్టీసీ బాబు, ముఖేష్, రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాగర్ కర్నూలు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డాగ్ స్క్వాడ్ ప్రత్యేక తనిఖీలు

**.నాగర్ కర్నూల్ /ప్రజా వాయిస్,** (జూన్ 13)జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నార్కోటిక్ (మాదకద్రవ్యాల) గుర్తింపు పరీక్షలు నిర్వహణ.పలు ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు చేపట్టిన పోలీసులు. అ నుమానాస ్పద వస్తువులు, మాదకద్రవ్యాల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యమని పోలీసుల స్పష్టం.తనిఖీల్లో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.మాదకద్రవ్యాల నియంత్రణకు జిల్లా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు.ప్రజలు అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



# స్కూల్ బస్సులు పసుపు రంగులోనే ఎందుకు ఉంటాయి?

**నాగర్ కర్నూల్ / ప్రజా వాయిస్,** (జూన్13)1930లో అమెరికాలో మొదటిసారిగా స్కూల్ బస్సులకు పసుపు రంగు వేయడం ప్రారంభం.కొలంబియా యూనివర్సిటీ ప్రొఫెసర్ స్కూల్ రవాణాపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఆ సమావేశంలో స్కూల్ అధికారులు, బస్సు తయారీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.సైన్స్ ప్రకారం పసుపు రంగు మన కంటికి త్వరగా, స్పష్టంగా కనిపిస్తుంది.వర్షం, పొగమంచు, మబ్బులు ఉన్న సమయంలో కూడా పసుపు రంగు దూరం నుంచే గుర్తించవచ్చు.దీంతో ఇతర వాహనాల డ్రైవర్లు స్కూల్ బస్సును సులభంగా గుర్తిస్తారు.పిల్లల భద్రతను దృష్టిలో పెట్టుకుని పసుపు రంగును ఎంపిక చేశారు.ఎరుపు రంగు ఇప్పటికే డేంజర్ సిగ్నల్స్, బ్రేక్ లైట్లు, స్టాప్ బోర్డులకు ఉపయోగిస్తున్నారు.స్కూల్ బస్సులకు కూడా ఎరుపు రంగు వేస్తే డ్రైవర్లు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని భావించారు.సమావేశంలో పలు రంగులను పరిశీలించిన తర్వాత పసుపు, నారింజ రంగులు తుది జాబితాలో నిలిచాయి.ఎక్కువ మంది ఓట్లతో పసుపు రంగును అధికారికంగా ఎంపిక చేశారు.అప్పటి నుంచి స్కూల్ బస్సుల గుర్తింపు రంగుగా పసుపు కొనసాగుతోంది.రోడ్డుపై పసుపు బస్సు కనిపిస్తే "ఇందులో స్కూల్ పిల్లలు ఉన్నారు" అనే హెచ్చరికగా భావిస్తారు.స్కూల్ బస్సుల పసుపు రంగు వల్ల ప్రమాదాలను తగ్గించి పిల్లల భద్రతను పెంచడం సాధ్యమవుతోంది.



# లక్డారం దళిత రైతులకు న్యాయం చేయాలి

- అస్సైన్డ్ భూముల స్వాధీనంపై మెట్టు శ్రీధర్ ఆందోళన
- లక్డారం సర్వే నెం. 498లో 21 ఎకరాల 31 గుంటల భూముల సమస్యపై పరిశీలన
- నాలుగు దశాబ్దాలుగా సాగు చేస్తున్న రైతుల జీవనాధారంపై ఆందోళన
- నోటీసులు, సరైన పరిహారం లేకుండా భూముల స్వాధీనం అన్యాయమని విమర్శ
- ఎస్టీపీ ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదని స్పష్టీకరణ
- బాధిత రైతులకు చట్టబద్ధ న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- బాధిత రైతులతో కలిసి భూముల సందర్శన



**ప్రజా వాయిస్,పటాన్‌చెరు** (లక్డారం).లక్డారం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 498లో గల 21 ఎకరాల 31 గుంటల అస్సైన్డ్ భూమిని సాగు చేస్తున్న దళిత రైతులకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు న్యాయం చేయాలని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు. శనివారం బాధిత రైతులతో కలిసి భూములను సందర్శించి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.

### నాలుగు దశాబ్దాలుగా సాగు చేస్తున్న రైతులు

ఈ సందర్భంగా మెట్టు శ్రీధర్ మాట్లాడుతూ, దాదాపు నాలుగు దశాబ్దాలుగా పేద దళిత రైతులు ఈ భూములను సాగు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. భూములు వారి జీవనాధారంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం రైతుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించాలని కోరారు.

### పరిహారం లేకుండా స్వాధీనం బాధాకరం

అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల సంక్షేమం కోసం అవసరమేనని పేర్కొన్న ఆయన, వాటి అమలులో పేద రైతుల హక్కులు, జీవనోపాధి దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నోటీసులు ఇవ్వకుండా, సరైన పరిహారం చెల్లించకుండా భూములను స్వాధీనం చేసుకోవడం బాధాకరమని అన్నారు.

### ప్రాజెక్టులకు మద్దతే.. రైతులకు న్యాయం కూడా కావాలి

ఎస్టీపీ (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) వంటి ప్రజాప్రయోజన ప్రాజెక్టుల ఏర్పాటును తాము వ్యతిరేకించడం లేదని స్పష్టం చేశారు. అయితే ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోతున్న రైతులకు చట్టబద్ధమైన పరిహారం, పునరావాసం లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు

### రైతుల పక్షాన నిలుస్తాం

సంబంధిత అధికారులు బాధిత రైతుల పరిస్థితిని పునఃసమీక్షించి, వారితో చర్చించి న్యాయబద్ధమైన పరిష్కారం చూపాలని మెట్టు శ్రీధర్ కోరారు. ఎస్సీ రైతుల హక్కులు, జీవనాధార పరిరక్షణ కోసం తెలంగాణ యువజన సంఘాల సమితి, నవభారత్ నిర్మాణ్ యువసేన ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ వీరేశం, స్థానిక నాయకులు, బాధిత రైతులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం రంగాపూర్ సమీపంలోని ఉమామహేశ్వర క్షేత్రంలో భారీ వర్షాలు

**నాగర్ కర్నూల్ / ప్రజా వాయిస్,** (జూన్ 13)అచ్చంపేట నల్లమల్ల కొండపై నుంచి పరవళ్లు తొక్కుతున్న జలపాతంశుక్రవారం రాత్రి కురిసిన తొలకరి వానలతో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నీరునింగి నుంచి భూమికి దిగుతున్నట్లుగా కనువిందు చేస్తున్న జలపాత దృశ్యాలు ప్రకృతి రమణీయతతో భక్తులను ఆకట్టుకుంటున్న ఉమామహేశ్వర క్షేత్రంభారీ నీటి ప్రవాహంతో మరింత ఆహ్లాదకరంగా మారిన క్షేత్ర పరిసరాలుకొండపై నుంచి భారీగా దూకుతున్న జలపాతం వీక్షణకు భక్తుల ఆసక్తిభారీ వర్షాల నేపథ్యంలో కొండచరియలు విరిగిపడే ప్రమాదంక్షేత్రానికి వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి సూచనభక్తులు భద్రతా జాగ్రత్తలు పాటించాలని ఆలయ నిర్వాహకుల విజ్ఞప్తిఉమామహేశ్వర క్షేత్రంలో ప్రకృతి సోయగాలు, భక్తి వాతావరణం కలగలిసి ప్రత్యేక ఆకర్షణగా మారిన దృశ్యాలు.

# జిల్లాలో విస్తారంగా వర్షాలు...

- మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా ఉరుములు మెరుపులతో భారీ వర్షం



**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో విస్తారంగా భారీ వర్షాలు కురిసాయి. దీంతో రైతుల్లో కొంత ఆశలు చిగురించాయని చెప్పవచ్చు. ఎందుకంటే గత మూడు నాలుగు రోజులుగా అడపా దడపగ కురుస్తున్న వర్షాలతో రైతులు నారుమల్లి సిద్ధం చేసుకోవడంతో పాటు పత్తి విత్తనాలు వేస్తున్నారు. మరోవైపు మీడియాలో వర్షాలు ఆశించిన స్థాయిలో పడే అవకాశం లేదని వార్తలు వస్తునందున విత్తలను ఎందుకు వేసామా అన్న ఆందోళనలో రైతులు ఉండేది. కానీ గత రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం 12 గంటల చిరుజల్లులతో మొదలై అతి భారీ వర్షాలు పడుతున్నాయి. సదాశివపేట పట్టణ సమీపంలోని సిద్ధాపూర్ కాలనీలో భారీ వర్షంతో పాటు ఈదురు గాలులు రావడంతో చెట్లు నేలకొరిగాయి. నేను నా ప్రాంతంలో కొంత మేరకు రాకపోకలకు అంతరాయం జరిగింది. దయంతో పాటే విద్యుత్ సరఫరా కూడా పునర్ధనం చేందుకు విద్యుత్ సిబ్బంది రెండు గంటల పాటు శ్రమించారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో సైతం భారీ వర్షం కురిసింది. ఎందుకు మున్సిపల్ చైర్పర్సన్ కూన వనిత ముందస్తుగానే ప్రధాన డ్రైనేజీలో పుడుకపోయినా సిబ్బందితో తొలగించారు. అయినప్పటికీ రిక్షా కాలనీ, ఎల్బీనగర్, లాల్ సబ్ గడ్డ ప్రాంతంతో పాటు రాజంపేటలోని డ్రైవర్స్ కాలనీలో ఇండ్లలోకి నీళ్లు వచ్చాయి. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి.

# ఐదు రోజులపాటు భారీ వర్షాలు..

**ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచన**



**ప్రజా వాయిస్,సూర్యాపేట:**
రాబోయే ఐదు రోజులపాటు జిల్లాలో భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముండటంతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలాల్లో పనిచేసే సమయంలో ఉరుములు, మెరుపులు సంభవిస్తే వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడరాదని హెచ్చరించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని, వీలైనంత వరకు పక్కా భవనాల్లో ఆశ్రయం పొందాలని కలెక్టర్ సూచించారు. వర్షం కురిసే సమయంలో అత్యవసర పరిస్థితులు మినహా ప్రయాణాలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో డీసీపీ ఆకస్మిక తనిఖీ..!




**ప్రజా వాయిస్/జనగామ (పాలకుర్తి)**
డీజీపీ మరియు వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం వెస్ట్ జోన్ డీసీపీ రాజా మహేంద్ర నాయక్ పాలకుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని నేర కేసుల ఫైళ్లు, రికార్డులు, స్టేషన్ నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమై డీజీపీ ఆదేశాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, ఫిర్యాదులను సత్వరంగా స్వీకరించి పరిష్కరించడం, ప్రజా అనుకూల పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం, పోలీస్ శాఖపై ప్రజలకు మరింత విశ్వాసం కలిగే విధంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి సీఐ శ్రీ జానకిరామ్ రెడ్డి, ఎస్సై డి పవన్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వాలీబాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తా..

- దాసరి ఉష
- వాలీబాల్ అసోసియేషన్ పెద్దపల్లి నియోజకవర్గ గౌరవ అధ్యక్షురాలిగా దాసరి ఉష
- యువ క్రీడాకారుల ప్రోత్సాహమే లక్ష్యం.



**ప్రజా వాయిస్, పెద్దపల్లి :**
పెద్దపల్లి నియోజకవర్గ వాలీబాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షురాలిగా దాసరి ఉషను నియమించినట్లు వాలీబాల్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు, సీనియర్ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కన్న రమేష్, పెద్దపల్లి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కస్తూరి లక్ష్మారెడ్డి, జిల్లా మహిళా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎర్రం అనిత ముదిరాజ్, మహిళా వాలీబాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బండారి స్రవంతి గౌడ్ ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, వాలీబాల్ క్రీడాభివృద్ధికి, ముఖ్యంగా యువ క్రీడాకారులను ప్రోత్సహించడంలో దాసరి ఉష కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి గౌరవ అధ్యక్షురాలి బాధ్యతలు అప్పగించిన అసోసియేషన్ నాయకత్వానికి దాసరి ఉష కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా వాలీబాల్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, క్రీడా రంగ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఉష పేర్కొన్నారు.

# మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



**ప్రజా వాయిస్, మంథని :**
మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా మున్సిపల్ కార్మికులు చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం వీరందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అడ్డు అదుపు లేకుండా గ్యాస్ గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు మరియు నిత్యావసర సరుకుల ధరలు పెంచడంతో కార్మిక కుటుంబాలపై తీవ్రమైన బారాలు పడుతున్నారని అన్నారు. ఈ మాసంలో జరిగే దిశల వారి ఉద్యమాలలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు మల్లేష్, చందు, గట్టయ్య, రాజేష్, పోచమ్మ, సుక్కమ్మ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వాయిస్ కథనానికి స్పందన..

# ఇండ్ల స్థలాల జాబితాపై అధికారుల దృష్టి

**ప్రజా వాయిస్ కథనం అనంతరం నూతన 20 మంది లబ్ధిదారుల జాబితా నిలిపివేత**

- పాత జాబితాలోని 75 మంది అర్హులపై సమగ్ర విచారణకు డిమాండ్
- నిజమైన నిరుపేదలకే స్థలాలు కేటాయించాలని ప్రజల విజ్ఞప్తి
- జిల్లా కలెక్టర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో పరిశీలన జరపాలని కోరుతున్న గ్రామస్తులు


ప్రజా వాయిస్
ఇది ప్రజల గొంతుక
30 May 2026 - Page 4
పేదవాడికి అందని ప్రభుత్వ ఫలాలు
కంచే చేను మేసిన చందంగా అధికారుల తీరు


**ప్రజా వాయిస్, హనుమకొండ/ఆత్మకూర్:**



హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గంలోని ఆత్మకూర్ మండలం నీరుకుల్లా శివారులో చలివాగు వద్ద ఇళ్ల స్థలాల కేటాయింపుల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో 75 మంది లబ్ధిదారులను గుర్తించి స్థలాలు కేటాయించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అయితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనంతరం గత ప్రభుత్వం ఆ జాబితాలో మార్పులు చేసి కొందరు కొత్త పేర్లను చేర్చిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థలాల పరిమాణాన్ని తగ్గించి నూతనంగా 20 మంది పేర్లతో మరో జాబితా రూపొందించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

**అర్హతలపై అనుమానాలు**
నూతన జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులు, భూములు కలిగిన వారు, ఇప్పటికే ఇళ్లు ఉన్న వారు కూడా చోటు దక్కించుకున్నారనే ఆరోపణలు గ్రామంలో చర్చకు దారితీశాయి. మరోవైపు నిజంగా ఇల్లు లేని నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల కుటుంబాలు, దివ్యాంగులు జాబితాలో చోటు దక్కించుకోలేదని పలువురు వాపోతున్నారు.

**ప్రజా వాయిస్ కథనంతో కదిలిన వ్యవస్థ**
ఈ అంశంపై ప్రజా వాయిస్ ప్రచురించిన కథనం అనంతరం సంబంధిత అధికారులు స్పందించినట్లు సమాచారం. నూతనంగా రూపొందించిన 20 మంది లబ్ధిదారుల జాబితా అమలును తాత్కాలికంగా నిలిపివేసినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో గ్రామ ప్రజల్లో కొంత ఆశాభావం నెలకొంది. 75 మంది పాత లబ్ధిదారుల జాబితాపై విచారణ కోరుతూ పాత జాబితాలో ఉన్న 75 మంది లబ్ధిదారుల అర్హతలు, ప్రస్తుతం వారి పరిస్థితులు, గతంలో జరిగిన మార్పులు వంటి అంశాలపై సమగ్ర పరిశీలన జరపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అర్హులైన వారిని గుర్తించి వారికి న్యాయం చేయాలని కోరుతున్నారు.



ప్రభుత్వ ఇంటి స్థలం
- ఉన్నవాడికే ఇల్లు... ఏసీ లతో... ఇవేనా ప్రభుత్వానికి కనిపిస్తున్న అర్హతలు
- మొద్దు నిద్రలో సంబంధిత అధికారులు పేదలకు కేటాయించిన స్థలాలు అన్యాక్రాంతం,
- ప్రజావాణిలో ఇంటి స్థలాల దరఖాస్తులు

**కలెక్టర్ పర్యవేక్షణలోనే తుది నిర్ణయం తీసుకోవాలి**
ఇళ్ల స్థలాల కేటాయింపులో రాజకీయ ప్రభావం లేదా వ్యక్తిగత ప్రయోజనాలకు అవకాశం లేకుండా జిల్లా కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నిజంగా ఇల్లు లేని పేద కుటుంబాలను గుర్తించి వారికి మాత్రమే స్థలాలు కేటాయిస్తే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని అభిప్రాయపడుతున్నారు.

**ప్రజల ఆకాంక్ష**
నిజమైన అర్హులైన నిరుపేదలకు న్యాయం జరగాలని, ఇళ్ల స్థలాల కేటాయింపులో పారదర్శకత పాటించాలని, పూర్తి స్థాయి విచారణ అనంతరం మాత్రమే తుది జాబితాను ప్రకటించాలని గ్రామ ప్రజలు జిల్లా యంత్రాంగాన్ని కోరుతున్నారు.

# అర శతాబ్దం అనుబంధం

**షాబాద్ జెడ్పీహెచ్ఎస్ స్కూల్ లో మన బడి మన జ్ఞాపకాలు**

**బడి వీడిన 51 సంవత్సరాల పదవ తరగతి బ్యాచ్‌ల అపూర్వ మహా సమ్మేళనం**

**హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్, బొబ్బిలి ప్రవీణ్, ఏగురి మల్లికార్జున్ పట్టుదలకు దక్కిన విజయం**




(ప్రజా వాయిస్ షాబాద్)
షాబాద్: పడి పడి చదివిన పాఠశాలలోని 1995 - 2026 51 సంవత్సరాల పూర్వ విద్యార్థులు ఒక్కటైతే.. ఆ ఆనందోత్సవాలకు అదుపులు ఉండవని శనివారం నాటి అపూర్వ ఘట్టం నిరూపించింది. ఇలాంటి చారిత్రాత్మక మహా సమ్మేళనం బహుశా ఒక్క షాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకే సాధ్యమయిందని చెప్పవచ్చు. శనివారం మండల పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణంలో "మన బడి - మన జ్ఞాపకాలు" అంటూ సమస్త పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన వేడుక అత్యంత వైభవంగా కంటికింపుగా జరిగింది ఈ సమ్మేళనంలో చిన్నా పెద్ద అనే తేడా లేకుండా ఒకే పాఠశాలలో మూడు తరాలుగా విద్యను అభ్యసించిన విద్యార్థులంతా ఒకే చోట చేరడం విశేషం 51సంవత్సరాల పదవ తరగతి బ్యాచ్‌లకు చెందిన వేలాది మంది విద్యార్థులు ఒకే వేదిక మీద కలవడం అనేది ఒక అద్భుతమైన ఘట్టంగా ప్రతి ఒక్కరి మదిలో ఎప్పటికీ నిలిచిపోయే మధుర జ్ఞాపకంగా మారిపోయింది. ఒకప్పటి క్లాస్‌మేట్స్ అంతా పరస్పరం సోదర భావంతో స్నేహంగా ఆలింగనం చేసుకుంటూ ఆనాటి బడి రోజులను గుర్తుచేసుకున్నారు తఅర్ధ శతాబ్ద కాలానికి చెందిన ఇంతటి భారీ ఉత్సవాన్ని, వేలాది మంది విద్యార్థులను ఒకే తాటిపైకి తీసుకురావడం వెనుక కొందరు విద్యార్థుల అకుంఠిత దీక్ష పట్టుదల దాగి ఉన్నాయి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని అహర్నిశలు శ్రమించి సమస్త పూర్వ విద్యార్థులను ఏకం చేసిన కొండా విజయ్ కుమార్ హోప్ ఫౌండేషన్ చైర్మన్ ,బొబ్బిలి ప్రవీణ్ కుమార్, ఏగురి మల్లికార్జున్ కు సమ్మేళనంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ప్రత్యేక ధన్యవాదాలు మరియు అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా అందరు మాట్లాడుతూ..ఇలాంటి సమ్మేళనాలు ఎల్లప్పుడూ ఆత్మీయతను స్నేహ బంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని వారు పేర్కొన్నారు తాము ఈరోజు సమాజంలో ఇంతటి ఉన్నత స్థానాల్లో నిలబడి ప్రయోజకులు కావడానికి అహర్నిశలు శ్రమించి విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి పాత గురువుల నుండి నేటి వరకు ప్రతి ఒక్క గురువును వెతికి పట్టుకుని ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ విద్యార్థుల కృషికి నిదర్శనంగా నిలిచింది వేదికపై ఉపాధ్యాయులందరినీ శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేక జ్ఞాపికలను అందజేసి విద్యార్థులు తమ అనన్యమైన గురుభక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పూర్వ ఉపాధ్యాయులు, మరియు వేలాది మంది పూర్వ విద్యార్థులు పాల్గొనిఆయా బ్యాచ్‌ల ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించి కార్యక్రమం విజయవంతం చేసినందుకు నిర్వాహకులు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**పరకాల ఇందిరా మహిళ పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ ఏర్పాటు**

**శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి**



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**
హనుమకొండ భవాని నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు పరకాల ఇందిరా మహిళా డైరీ కార్యవర్గ సమావేశాన్ని అధికారితో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...డైరీ ఆవశ్యకత, నిర్మాణం యజమాని బాధ్యతలు పాల ఉత్పత్తి,పాల మార్కెటింగ్ పై అవగాహన కల్పించడమే కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రాథమిక సొసైటీలోనా సభ్యత్వం నమోదు పెంపు,దామెర లో దాదాపు 10 ఎకరాల భూమి కేటాయించామని,తదితర అంశాలపై చర్చించారు. అలాగే ఈ డైరీ ఏర్పాటుకు రాష్ట్ర, యంత్రాంగ కృషి ఎంతో ఉందన్నారు. నన్ను ఎమ్మెల్యేగా గెలిపించిన ఆడబిడ్డల రుణం తీర్చుకునేందుకు పరకాల ఇందిరా మహిళా డైరీ ఏర్పాటుచేస్తున్నామన్నారు. ప్రభుత్వ సహకారంతో అధికారుల కృషితో, రాజకీయాలకు అతీతంగా పరకాల డైరీనీ అభివృద్ధి చేసుకుందాం అని,ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడాలంటే పాడి పరిశ్రమలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఇది కేవలం ఒక ఆర్థికపరమైన వ్యాపారం మాత్రమే కాదు, ప్రజల జీవితాల్లో వెలుగు నింపే మహా యజ్ఞం అని, ఈ యజ్ఞంలో పరకాల నియోజకవర్గం ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. త్వరలో గ్రామాలలలో పాల సేకరణ చేపట్టాలని,సబ్సిడీ ద్వారా గేదెలు కొనుగోలు, దాన,గడ్డి సేకరణ చేపట్టాలని అన్నారు. 5 సంవత్సరాలు నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ తో ఒప్పందం జరిగిందని అన్నారు.

# అకాల గాలివానతో ఇల్లు గోడలు కూలిన బాధితులకు అండగా ఎస్ఆర్ఆర్

**12 కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాసరెడ్డి**



**ప్రజా వాయిస్/రాయపర్తి**
వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిర్మలయాపల్లి గ్రామంలో శుక్రవారం రోజున సంభవించిన అకాల గాలి వానతో, కొందరి ఇండ్లు గోడలు కూలి, నష్టపోయిన బాధిత కుటుంబలు అయిన గుడికందుల మణెమ్మ, ఉప్పాల ఎల్లయ్య, భాషబోయిన బుచ్చేల్లయ్య, గడ్డం ఎల్లమ్మ, గజవెల్లి భాగ్యమ్మ, గాజు రమాదేవి, రాచకొండ పురుషోత్తం, వశపాక యకమ్మ, వశపాక లావణ్య, వశపాక కేతమ్మ, గజవెల్లి ప్రమీల కుటుంబ లకు అండగా నిలిచి వారికీ మనోధైర్యం కలిపించి ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్' తరపున ఒక్కో కుటుంబనికి ఆర్థిక సహాయం చేసిన ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులపరుపటి శ్రీనివాస్ రెడ్డి ఈ సహాయంను వారి కుటుంబ సభ్యులకు అందించిన రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, స్థానిక సర్పంచ్ బరిగేలా బాబు మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, సంకినేని ఎల్లస్వామి, స్థానిక నాయకులు అయిన దోకుడు దేవేందర్, గుడి యుగేందర్ రెడ్డి, దోకుడు సొమెందర్, గజావెల్లి రాజు, దోమల కుమార్, వశపాక రాజు, వశపాక బాబు, వశపాక విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పాలకుర్తి మండల సర్పంచుల ఫోరం

# నూతన అధ్యక్షుడిగా గడ్డం కిరణ్



**ప్రజా వాయిస్/పాలకుర్తి**
జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సర్పంచుల ఫోరం సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది. రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశానుసారం, మండల సర్పంచులు ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు ఏకగ్రీవంగా ఎన్నికైన నాయకులు అధ్యక్షుడు గడ్డం కిరణ్ ఉపాధ్యక్షురాలు చింతకింది అనిత ప్రధానకార్యదర్శి భోడిగ ప్రదీప్ కోశాధికారి భానోత్ రవీందర్ నాయక్ బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలకు అంకితభావంతో పనిచేస్తూ, గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచులందరినీ ఒకే వేదికపై నడిపిస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తామని నూతన కమిటీ స్పష్టం చేసింది. పాలకుర్తిలో బీఆర్ఎస్ జెండా మరింత ఎగరబోతుందనే సంకేతంగా ఈ ఏకగ్రీవ ఎన్నికలు నిలిచాయని పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి

# కాంగ్రెస్ పార్టీలో కలకలం

## ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ ఆలీకి నోటీసులు



**ప్రజా వాయిస్ దోమకొండ**
కాంగ్రెస్ కామారెడ్డి కాంగ్రెస్ పార్టీలో కలకలం సంచలనం సంఘటనలు జరుగుతున్నాయి. మాజీ మంత్రి రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ ఎస్టీ మైనారిటీ శాఖల సలహాదారులు షబ్బీర్ అలీకి శోకాజ్ నోటీసులు జారీ చేశారు. మహిళలపై అనుచితంగా మాట్లాడారని కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్పర్సన్ హిందూ ప్రియ కాంగ్రెస్ అదృష్టానికి చేసిన ఫిర్యాదు మేరకు నోటీసులు జారీ చేశారు. సీనియర్ నేతకు షో కాస్ నోటీసులు జారీ చేయడంతో కామారెడ్డి కాంగ్రెస్ పార్టీలో కలకలం రేగుతుంది. ఇటీవల చైర్ పర్సన్ భర్త రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గడ్డం చందు పై షబ్బీర్ అలీ వర్గం అధిష్టానానికి ఫిర్యాదు చేసింది. షబ్బీర్ అలీ చందు వర్గం పరస్పరం గాంధీభవన్లో ఫిర్యాదులు చేసుకున్నారు. గడ్డం చెందును పార్టీ నుండి సస్పెండ్ చేయకుంటే గాంధీభవన్ ముందు ధర్నా చేస్తామని షబ్బీర్ అలీ అనుచరులు ఫిర్యాదు చేశారు. షబ్బీర్ అలీ అనుచిత వ్యాఖ్యలు మహిళలపై చేశారని మాజీ చైర్ పర్సన్ హిందూ ప్రియ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. అటు గడ్డం చందుకు అధిష్టానం క్రమశిక్షణ సంఘం షోకేస్ నోటీసు జారీ చేసింది. తాజాగా శనివారం నాడు మాజీమంత్రి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని హిందూ ప్రియ ఫిర్యాదు పై శోభరాజ్ నోటీసులు జారీ చేశారు

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోండి

### బీఎస్పీ డిమాండ్



**ప్రజా వాయిస్ : సిద్దిపేట**
సిద్దిపేట జిల్లాలో విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి, సామాన్య మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ డిమాండ్ చేసింది. శనివారం సిద్దిపేట నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు ఎల్కేజీ, యూకేజీ తరగతులకు కూడా భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. పాఠశాలలు ప్రారంభం కాకముందే బుక్స్, యూనిఫారాలను స్కూళ్లలోనే అధిక ధరలకు విక్రయిస్తూ వ్యాపార కేంద్రాలుగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తూ, అనుమతులు లేని పాఠశాలలను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ దోపిడీని అరికట్టకపోతే, బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు రోమాల బాబు, సిద్దిపేట అసెంబ్లీ ఇన్‌చార్జ్ పంగబాబు, బూత్ అధ్యక్షుడు లతానియల్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# పొంచి ఉన్న ప్రమాదం ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

### వ్యవసాయ పొలంలో ఇనుప స్తంభాలు పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు




**ప్రజా వాయిస్ మిరుదొడ్డి**
సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఉండడంతో రైతులు ట్రాక్టర్ తో పొలం దున్నాలంటే భయపడుతున్నారు ట్రాక్టర్ కు అనుకుంటూ వెళ్తున్నాయని ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని పంట పొలాలలో ఇనుప స్తంభాలు ఉండడం తో వర్షాకాలం విద్యుత్ షాక్ తలిగే ప్రమాదం ఉందని రైతులు ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రైతుల పొలంలో ఉన్న కరెంటు తీగలను తొలగించాలని ఇనుప స్తంభాలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

### బీఎస్పీ వరంగల్ పార్లమెంట్ ఇంచార్జ్‌గా

# మడిపడిగ చంద్రశేఖర్

**పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయి వరకు తీసుకువెళ్తాను**
**అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తాను.**
**బహుజనుల హక్కుల సాధన కోసం కృషి చేస్తాను.**
**వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్సీరాం ఆశయాలను**
**ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తాను.**
**వరంగల్ పార్లమెంట్ ఇన్చార్జి మడిపడిగ చంద్రశేఖర్**



**ప్రజా వాయిస్/జనగామ జిల్లా బ్యూరో**
బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రామ్ శేఖర్ జనగామ జిల్లా,లింగాలఘణపురం మండలం,సిరిపురం గ్రామానికి చెందిన మడిపడిగ చంద్రశేఖర్ ను వరంగల్ పార్లమెంట్ ఇంచార్జ్‌గా నియమించారు. మడిపడిగ చంద్రశేఖర్ గతంలో స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ ఇంచార్జ్‌గా, జనగామ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా,జనగామ జిల్లా అధ్యక్షులుగా పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారు.పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లడంలో,బహుజన సమాజ సమస్యలపై పోరాటం చేయడంలో ఆయన చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర నాయకత్వం ఈ కీలక బాధ్యతను అప్పగించింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని,వరంగల్ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీని మరింత బలోపేతం చేసి బహుజనుల హక్కుల సాధన కోసం కృషి చేస్తానని తెలిపారు.అదే విధంగా మహనీయుల సిద్ధాంతాలను,పార్టీ వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్షిరాం ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తానని అన్నారు.నా నియామకానికి సహకరించిన ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియచేసారు.

# జగంగూడ దాన్యం కొనుగోలు కేంద్రాల్లో భారీ స్కామ్

- రైతుల సంతకాలను ఫోర్జరీ చేస్తు బిల్లులు దండుకుంటున్న నిర్వాహకులు
- జగ్గంగూడ దాన్యం కొనుగోలు కేంద్రాల్లో బయటపడిన బాగోతం
- విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలి
- ఆందోళనకి దిగిన రైతులు



**మేడ్చల్, శామీర్ పేట / ప్రజా వాయిస్ :**
రైతులు ఆరు నెలలు కష్టపడి పండించిన దాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం బ్యాగుల్లో భారీగా కోతలు విధిస్తు నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్న బాగోతం శనివారం బట్టబయలైంది. మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు దాన్యాన్ని విక్రయించారు. రైతులు తూకం వేసిన దాన్యం బస్తాల రశీదు ఒకలాగ ఉంటే ట్రక్ షీట్లో మరో విదంగా నమోదు చేస్తు రైతుల పొట్టకొడుతున్నారు. ఇటీవల జగ్గంగూడలో ఓ లారీని దాన్యం బస్తాలతో లోడ్ చేయగా సుమారు 810 బ్యాగులు మిల్లర్లకు తరలించారు. మిల్లర్ల వద్ద తూకం వేసి ఓ లారీ లోడ్లో సుమారు 33 బ్యాగులు కోత విదిస్తే కొనుగోలు కేంద్రం నిర్వాహకులు చేతివాటం ప్రదర్శించి 63 బ్యాగులు కోత విధించినట్లు లెక్కల్లో చూపడంతో కేంద్రం నిర్వాహకుల బాగోతం వెలుగులోకి వచ్చింది. రైతుల సంతకాలను ఫోర్జరీ చేస్తు చదువురాని రైతుల సంతకాలను ఇంగ్లీష్ లో సంతకం చేస్తు ఇష్టానుసారంగా బిల్లులు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. అలియాబాద్ దాన్యం కొనుగోలు కేంద్రం ఇంచార్జ్ విజయ్ ఆదేశాలతో చేస్తున్నట్లు జగ్గంగూడ దాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు రాము తెలిపాడు. ఇంత జరుగుతున్న అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటు దీంట్లో అధికారుల చేతివాటం ఉందని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే దాన్యం విక్రయించాలని జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికి రైతులకు జరుగుతున్న అన్యాయంపై అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన దాన్యం మిల్లర్లకు చేరే సరికి తూకంలో భారీగా తేడాలు వస్తున్నాయని దీంతో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. రైతుల సంతకాలను ఫోర్జరీ చేసి రశీదులపై సంతకాలు చేస్తు ఓటిపిలు చెప్పించుకుని రైతుల ఖాతాల్లో వారికి రావాల్సిన సరైన డబ్బులను వేయడం లేదని రైతులు ఆరోపించారు. ఇప్పటికైన జగ్గంగూడ కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న భారీ స్కామ్ను ఉన్నతాధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు విష్ణువర్ధన్ రెడ్డి, వీరేశం, ప్రహ్లాద్, సత్తయ్య, శ్రీకాంత్ రెడ్డి, సురేష్ తదితర రైతులు పాల్గొన్నారు.

# కీసరలో మత్తుపదార్థాలపై అవగాహన

**నో డ్రగ్స్ సేవ్ లైఫ్ అంటూ కరపత్రాలు పంచుతూ ఫ్లెక్సీలు మైక్ సెట్ ద్వారా అవగాహన కార్యక్రమం**
**ఉపాధ్యాయుడు సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్**
**డ్రగ్స్ గంజాయి మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే నష్టాలు**
**రోడ్డు భద్రతపై వినూత్నంగా అవగాహన కార్యక్రమం**




**మేడ్చల్, కీసర / ప్రజా వాయిస్ :**
శనివారం సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం ZPHS గోరంట్ల పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ స్థానిక పోలీసులతో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రజలకు యువతకు గంజాయి డ్రగ్స్ మత్తు పదార్థాలు పొగాకు ఉత్పత్తులు సేవించడం వల్ల కలిగే నష్టాలు మరియు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు మాదక ద్రవ్యాలు గంజాయి సేవించడం వల్ల ఎన్నో శారీరక, మానసిక, ఆర్థిక సామాజిక అనర్థాలు కలుగుతాయన్నారు. కావున వాటికి దూరంగా ఉండి తమను తాము రక్షించుకోవాలని తెలిపారు. యువత ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ప్రణాళిక బద్ధంగా కష్టపడి లక్ష్యాన్ని సాధించి సమాజానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అదేవిధంగా రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రతి ఒక్కరు క్షేమంగా గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్ వాడాలని, కారు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించాలని అన్నారు. నో డ్రగ్స్ సేవ్ లైఫ్ అంటూ కరపత్రాలు పంచుతూ ఫ్లెక్సీలు మైక్ సెట్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు, యువత, కీసర పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన

### కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ రెడ్డి



**ప్రజా వాయిస్-వనపర్తి జిల్లా**
ప్రజా పాలన ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి వ్యక్తిగత కార్యదర్శి మధుసూదన్ రెడ్డి తెలిపారు.బస్సు యాత్ర తో శనివారం పీపనగండ్ల మండల కేంద్రంలో కళాకారులు పాటలు, నృత్యాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించారు. అలాగే గత రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేశారు.ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ,,, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి, తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులు, వివిధ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంపీ మల్లు రవి పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వ దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కొత్త రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్ల పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాల అందజేత వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మీసాల పార్వతమ్మ, ఉప సర్పంచ్ బాలపీర్, కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు పాము రాజశేఖర్, వార్డు సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రవీందర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు నక్క విష్ణు, కావలి మహేష్, గ్రామ రైతు కమిటీ అధ్యక్షుడు పోతుల వెంకట్ రెడ్డి, కళాబృందం టీం లీడర్ మీసాల రాము, గ్రామ కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులు

**అనుమతులు లేని అడ్మిషన్లు**
**పేరెంట్స్ ను దోపిడీ చేస్తున్న యాజమాన్యాలు**




**దోమకొండ ప్రజా వాయిస్**
కామారెడ్డి నియోజకవర్గంలో ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని అనుమతులు లేని అడ్మిషన్ తీసుకుంటున్నాయని తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఏబీవీపీ కామారెడ్డి జిల్లా నేతలు ఆరోపించారు. అనుమతులు లేని పాఠశాలలను రద్దు చేయకుంటే గాడిదతో డిఈఓ ఆఫీస్ ముట్టడిస్తామని ఏబీవీపీ నేతలు హెచ్చరించారు. కామారెడ్డి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వం నిబంధనలను అతిక్రమిస్తున్నారని ఆరోపించారు. నిబంధన ప్రకారం నడుచుకోవడం లేదని విమర్శించారు. వేలాది రూపాయలు అత్యధిక ఫీజులు అసలు చేస్తున్నారని ఏబీవీపీ నేతలు ఆరోపించారు. అధిక ఫీజులు అనుమతులు లేని అడ్మిషన్లు జరుపుతున్నారని గుర్తింపు లేని పాఠశాలలను రద్దు చేయకుంటే డీఈఓ ఆఫీస్ ముట్టడిస్తామని ఏబీవీపీ నేతలు హెచ్చరించారు. 9 10వ తరగతి అడ్మిషన్లకు అనుమతి లేకుండానే నిర్వహిస్తున్నారని ప్రైవేట్ గంద కేంద్రాలుగా ప్రైవేట్ పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. విలేకరుల సమావేశంలో అక్షయ్ కౌశిక్ స్వస్తిక్ వినయ్ తదితరులు మాట్లాడారు.

## రహదారికి ఇరువైపులా కంపచెట్లను తొలగింపు



**ప్రజా వాయిస్.. వనపర్తి జిల్లా**
వనపర్తి జిల్లాపీపనగండ్ల మండలంలోని వల్లభాపురం గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగించే కార్యక్రమాన్ని ఉప సర్పంచ్ బాలపీర్, సర్పంచ్ భర్త వెంకటేష్ ఆధ్వర్యంలో చేపట్టారు. ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా, రహదారిపై వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు ఈ చర్యలు తీసుకున్నారు. రహదారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రమాదాలను నివారించే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గ్రామస్థులు అభినందించారు.గ్రామాభివృద్ధి, ప్రజా సౌకర్యాల మెరుగుదలకు గ్రామ పంచాయతీ కృషి చేస్తోందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితరులు ఉన్నారు.

## హ్యూమన్ రైట్స్ జిల్లా చైర్మన్‌గా దేవోల్లా రాములు




**ప్రజా వాయిస్ దోమకొండ**
హ్యూమన్ రైట్స్ యాంటీ కార్పొరేషన్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా చైర్మన్‌గా పాల్వంచ మండలం ఫరీద్ పేట్ కు చెందిన దేవోల్లా రాములు ఎన్నికయ్యారు. ఇట్టి కార్యవర్గ సమావేశం సికింద్రాబాద్ అమృతవాణి నిలయంలో ఏర్పాటు చేశారు.ఈ మేరకు దేవోల్లా రాములు కు నియమాకపత్రాన్ని హ్యూమన్ రైట్స్ నేషనల్ ఫౌండర్ డైరెక్టర్ సాల్మన్ రాజ్, డైరెక్టర్ రవికుమార్ లీగల్ వింగ్ చైర్మన్ ఊర్మిళ రాణి పాత్రో , స్టేట్ చైర్మన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండ ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ మంజుల , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన శ్రీనివాస్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భం గా దేవోల్లా రాములు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు.మానవ హక్కులు (హ్యూమన్ రైట్స్) అంటే మనిషిగా జన్మించిన ప్రతి ఒక్కరికీ, ఎలాంటి వివక్ష లేకుండా (కుల, మత, వర్గ, లింగ భేదాలు లేకుండా) సంక్రమించే ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ. ఇవి ప్రతి మనిషి గౌరవంగా జీవించడానికి అవసరమైన న్యాయం, సమానత్వాన్ని అందిస్తాయని తెలిపారు.

## ఆలయ సుందరీకరణకు 51 వేలు అందజేసిన దోమకొండ సర్పంచ్ ఐరెని నరసయ్య



**ప్రజా వాయిస్ దోమకొండ**
దోమకొండ మండల కేంద్రంలోని మాదిగ పోచమ్మ 15వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ సుందరీ కరణకు ఆలయ కమిటీ సభ్యులకు దోమకొండ సర్పంచ్ ఐరేణి నరసయ్య శనివారం 51,116 అందజేశారు.ఆలయ సుందరీకరణ ఇతర మౌలిక సదుపాయాలకు నిధులు ఖర్చు చేయాలని కమిటీ సభ్యులకు సర్పంచ్ సూచించారు. ఈ ఆలయం దోమకొండలో పురాతనమైనదని భక్తులు అధిక సంఖ్యలో వస్తారని దోమకొండ వాసులు ఆలయాన్ని సందర్శిస్తారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రాజనర్సు, క్యాషియర్ సుదర్శన్, సభ్యులు నర్సింలు బిక్షపతి బాలయ్య భువనేశ్వర్ పాల్గొన్నారు.

# 130 కిలోమీటర్లు కారు నడిపిన విజయ్..

**మూకాంబిక అమ్మవారి దర్శనం**

**స్వయంగా డ్రైవ్ చేసిన సీఎం**

**అభిమానులకు అభివాదం**



**మంగళూరు, జూన్ 13**

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ కర్ణాటకలోని మూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం ఆయన చేసిన ప్రయాణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భద్రతా సిబ్బంది, కాన్వాయ్ వెంట ఉన్నప్పటికీ స్వయంగా కారు నడుపుతూ మంగళూరు విమానాశ్రయం వరకు ప్రయాణించారు. మూకాంబిక ఆలయం నుంచి మంగళూరు విమానాశ్రయం వరకు సుమారు 130 కిలోమీటర్ల దూరాన్ని విజయ్ స్వయంగా డ్రైవ్ చేయడం చర్చనీయాంశమైంది. సాధారణంగా ముఖ్యమంత్రుల ప్రయాణాల్లో ప్రత్యేక డ్రైవర్లు ఉంటారు. అయితే విజయ్ స్వయంగా వాహనం నడపడం అభిమానులను ఆకట్టుకుంది. ఈ ప్రయాణంలో విజయ్ ధరించిన దుస్తులు కూడా అందరి దృష్టిని ఆకర్షించాయి. సూట్‌లో కనిపించిన ఆయన వినూత్న శైలిలో అభిమానులకు దర్శనమిచ్చారు. ప్రయాణం మొత్తం ఆయన ఉత్సాహంగా కనిపించినట్లు స్థానికులు పేర్కొన్నారు. మార్గమధ్యంలోని ఓ టోల్‌గేట్ వద్ద కారు ఆపకుండా వాహనం నుంచే అభిమానులకు చేయి ఊపుతూ అభివాదం చేశారు. విజయ్‌ను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు రోడ్డు పక్కన వేచి ఉండగా, ఆయన వారికి చిరునవ్వుతో స్పందించారు. ఈ దృశ్యాలకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. మూకాంబిక అమ్మవారి ఆలయం దక్షిణ భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు తరచూ ఈ ఆలయాన్ని సందర్శిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. విజయ్ కూడా ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు సమాచారం. ఆలయ దర్శనం అనంతరం స్వయంగా వాహనం నడుపుతూ 130 కిలోమీటర్ల ప్రయాణం చేయడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ సాధారణ వ్యక్తిలా కారు నడిపిన విజయ్ తీరు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ప్రభుత్వ పాఠశాలలో పరిశుభ్రత

**మన బడి మన బాధ్యత**

**సేవలో బీజేపీ కార్యకర్తలు**

**విద్యార్థులకు స్వచ్ఛ వాతావరణం**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**

**కరీంనగర్, జూన్ 13**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ సేవలో కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. "మన బడి మన బాధ్యత" కార్యక్రమం కింద కుసుమ రామయ్య ప్రభుత్వ పాఠశాలలో స్వయంగా శుభ్రత పనులు చేపట్టి విద్యార్థులకు పరిశుభ్రమైన విద్యా వాతావరణం కల్పించాలనే సందేశాన్ని ఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవకు అంకితమైన పన్నెండు సంవత్సరాల ప్రయాణం స్ఫూర్తితో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బండి సంజయ్ తెలిపారు. విద్యార్థులు కొత్త విద్యా సంవత్సరాన్ని పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన పాఠశాలల్లో ప్రారంభించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బీజేపీ కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు పెద్దఎత్తున పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల ఆవరణలు, తరగతి గదులు, క్రీడా ప్రాంగణాలను శుభ్రపరిచి విద్యార్థులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించేందుకు కృషి చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజం కూడా భాగస్వామ్యం కావాలని బండి సంజయ్ పేర్కొ న్నారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యక రమైన అలవాట్లు పెంపొందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సామాజిక సేవకులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన పాఠశాలలు, మెరుగైన విద్యా వాతావరణం లక్ష్యంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని బండి సంజయ్ తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం కోసం సమాజంలోని అన్ని వర్గాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

# ఇరాన్-అమెరికా ఒప్పందం?

**వాషింగ్టన్, జూన్ 13**

మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు త్వరలోనే ముగింపు పలికే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇరాన్, అమెరికా మధ్య కొనసాగుతున్న చర్చలు కీలక దశకు చేరుకున్న నేపథ్యంలో శాంతి ఒప్పందం కుదిరే దిశగా సానుకూల సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడినట్లు అంతర్జాతీయ మాధ్యమాలు వెల్లడించాయి. ఇరాన్‌తో ఒప్పందం మరికొన్ని రోజుల్లోనే ఖరారయ్యే అవకాశం ఉందని ట్రంప్ పేర్కొన్నట్లు సమాచారం. ఈ చర్చలో యుద్ధానికి ముగింపు పలికే సమయం ఆసన్నమైందని ట్రంప్ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో కుదిరే ఒప్పందం ప్రాంతీయ స్థిరత్వానికి దోహదపడుతుందని, దీర్ఘకాలిక శాంతికి మార్గం సుగమం చేస్తుందని ఆయన నెతన్యాహుకు వివరించినట్లు సమాచారం. గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికా, ఇరాన్ మధ్య జరుగుతున్న చర్చలు తుది దశకు చేరుకున్నాయని ఇరు దేశాలకు చెందిన అధికారులు సంకేతాలు ఇస్తున్నారు. ఇరాన్ అణు కార్యక్రమం విషయంలో పలు అంశాలపై అవగాహన కుదిరినట్లు తెలుస్తోంది. గతంలో ఇరాన్‌లో పాలనా మార్పు అవసరమని బహిరంగంగా వాదించిన నెతన్యాహు కూడా ప్రస్తుతం చర్చల ద్వారా పరిష్కారం సాధించే దిశగా మొగ్గు చూపుతున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే ప్రతిపాదిత ఒప్పందంపై ఇజ్రాయెల్‌లో పూర్తి స్థాయి సంతృప్తి కనిపించడం లేదు. ఇరాన్‌పై ఆంక్షలు సడలిస్తే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావచ్చని, చమురు ఎగుమతుల ద్వారా ఆదాయం పెరిగే అవకాశం ఉందని ఇజ్రాయెల్ భద్రతా వర్గాలు భావిస్తు న్నాయి. అదే సమయంలో అణు కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేయకపోతే భవిష్యత్తులో కొత్త సవాళ్లు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ మాట్లాడుతూ, అమెరికా తన వ్యూహాత్మక ప్రయోజనాల దృష్ట్యా ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్తున్నప్పటికీ, ఇరాన్ అణు కార్యక్రమం, క్షిపణి సామర్థ్యాలు, అనుబంధ సాయుధ సంస్థల విషయంలో తమ భద్రతా ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.

# చదువుతోనే సమాజంలో గుర్తింపు

**మాదిగల అభ్యున్నతికి విద్యే మార్గం: మంద కుమార్ మాదిగ**

**రాజగోపాలపేట్, ముండ్రాయి గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ 'గో టు విలేజ్' కార్యక్రమం**

**చదువుకు దూరమైన వారిని తిరిగి బడిబాట పట్టించాలి**

**జూలై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపు**




**ప్రజా వాయిస్, సిద్దిపేట జిల్లా:**

గౌరవ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని రాజగోపాలపేట్, ముండ్రాయి గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ 'గో టు విలేజ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ జేరిపోతుల లక్ష్మణ్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామాల మాదిగ ప్రజలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ మంద కుమార్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ముక్కపల్లి రాజు మాదిగతో కలిసి ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా మంద కుమార్ మాదిగ మాట్లాడుతూ, సమాజంలో మాదిగల అభ్యున్నతికి విద్యే ప్రధాన ఆయుధమని అన్నారు. విద్య ద్వారానే వ్యక్తిగతంగా, సామాజికంగా గుర్తింపు సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థులను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించడంతో పాటు, వివిధ కారణాలతో చదువుకు దూరమైన పిల్లలను తిరిగి బడిబాట పట్టించే బాధ్యత కుటుంబాలు, గ్రామ పెద్దలు తీసుకోవాలని సూచించారు. మాదిగ సమాజం అన్ని రంగాల్లో ముందుకు రావాలంటే విద్యతో పాటు సామాజిక చైతన్యం కూడా అవసరమని ఆయన అన్నారు. యువత తమ భవిష్యత్తుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అలాగే రాబోయే జూలై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నీలి జెండాను ఆవిష్కరించి పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహించాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామాల మాదిగ యువకులు, పెద్దలు, మహిళలు, సామాజిక కార్యకర్తలు మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ నిధులపై మోసగాళ్ల కన్ను

**నకిలీ వివాహ పత్రాలతో రూ.21 లక్షల స్వాహా చేసేందుకు కుట్ర**

**రెవెన్యూ అధికారితో కుమ్మక్కైన ముఠా గుట్టురట్టు**

**రాజేంద్రనగర్,జూన్ 13 ప్రజావాయిస్**

పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని కొందరు అక్రమార్కులు ఆదాయ వనరుగా మార్చుకున్న ఘటన రాజేంద్రనగర్‌లో వెలుగుచూసింది. నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ నిధులను అక్రమంగా పొందుతున్న ముఠాను అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. అత్తాపూర్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం. కల్పిత లబ్ధిదారుల పేర్లతో దరఖాస్తులు రూపొందించి, వివాహాలకు సంబంధించిన ఆధారాలను డిజిటల్ మార్ఫింగ్ ద్వారా తయారు చేసినట్లు వెల్లడైంది. అనంతరం వాటిని అధికారిక వ్యవస్థలో ప్రవేశపెట్టి ప్రభుత్వ సహాయాన్ని పొందినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించాల్సిన రెవెన్యూ అధికారి నిర్లక్ష్యం లేదా సహకారం కారణంగానే మోసం సులభంగా జరిగిందని ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఇప్పటివరకు సుమారు రూ. 21 లక్షల మేర ప్రభుత్వ నిధులు అక్రమంగా పొందినట్లు పోలీసులు గుర్తించారు. దాడుల సమయంలో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, నకిలీ పత్రాలు, ఇప్పటికే మంజూరైన పలు చెక్కులను పోలీసులు స్వాధీనం



చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాల ఆధారంగా మరిన్ని దరఖాస్తులను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచినట్లు అత్తాపూర్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పేరుతో ఎవరైనా మధ్యవర్తులు డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు ప్రజలకు సూచించారు. ఈ మోసం ఒకే ప్రాంతానికే పరిమితమా.? లేక ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే తరహా అక్రమాలు జరిగాయా.? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. సంక్షేమ పథకాల అమలులో మరింత పర్యవేక్షణ అవసరమనే చర్చ ఈ ఘటనతో మళ్లీ తెరపైకి వచ్చింది.

# కుటుంబ కలహాలే కారణమా..?

## ఇద్దరు చిన్నారులకు ఉరివేసి తల్లి ఆత్మహత్య

### వికారాబాద్ జిల్లాలో విషాదం.. అడవి వెంకటాపూర్‌లో ముగ్గురు మృతి




**ప్రజా వాయిస్ / వికారాబాద్**

వికారాబాద్ జిల్లాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ తల్లి తన ఇద్దరు చిన్నారులకు ఉరివేసి హతమార్చి, అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన జిల్లాలోని అడవి వెంకటాపూర్ గ్రామంలో శనివారం వెలుగుచూసింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన నవనీత గత కొంతకాలంగా కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆమె తన ఏడేళ్ల కుమారుడు విఘ్నేష్, ఐదేళ్ల కుమార్తె మధుప్రియలకు ఇంట్లోనే ఉరివేసి హతమార్చింది. అనంతరం తాను కూడా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నారుల మృతితో గ్రామస్తులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణమా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

**గ్రామాన్ని కుదిపేసిన విషాదం**

ఆడుతూ పాడుతూ తిరిగే ఇద్దరు చిన్నారులు మృతిచెందడం గ్రామస్థులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఒక క్షణిక ఆవేశం, కుటుంబ సమస్యలు మూడు ప్రాణాలను బలితీసుకోవడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మానసిక సమస్యలపై అవగాహన అవసరం**

కుటుంబ కలహాలు, మానసిక ఒత్తిడులు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో బాధితులకు సకాలంలో కౌన్సిలింగ్, కుటుంబ సభ్యుల సహకారం, సామాజిక మద్దతు అందడం ఎంతో అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామీణ స్థాయిలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతున్నారు.

# జనంతో మాట.. పల్లె బాటలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**సీత్యా తండాలో ప్రజల సమస్యలపై నేరుగా ఆరా**

**నేడు ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం, గ్రామస్థులతో సమావేశం**



**ప్రజా వాయిస్ / మాడ్గులపల్లి**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రగతి సింగిడి -- జనంతో మాట.. పల్లె బాట కార్యక్రమంలో భాగంగా నాగార్జునసాగర్ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బి.ఎల్.ఆర్.) మాడ్గులపల్లి మండలంలోని సీత్యా తండా గ్రామపంచాయతీలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఎమ్మెల్యే గ్రామంలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామస్థులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో అనౌపచారికంగా మాట్లాడి వారి జీవన పరిస్థితులు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లోనే బస చేస్తూ ప్రజల మధ్య ఉండడం ద్వారా సమస్యలను మరింత సమర్థవంతంగా గుర్తించి పరిష్కరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే శనివారం ఉదయం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులతో సమావేశం కానున్నారు. అనంతరం గ్రామ ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి గ్రామాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై చర్చించనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.

# కోరుట్లలో 'అభ్యాస్' పాఠశాల ప్రారంభం




**ప్రజా వాయిస్, కోరుట్ల**

కోరుట్ల పట్టణంలోని బాలాజీ రోడ్డు, రాంనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'అభ్యాస్ అప్పర్ ప్రైమరీ' పాఠశాలను శనివారం ఘనంగా ప్రారంభించారు. పాఠశాల నిర్వాహకులు శ్రీరాముల ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ కౌన్సిలర్, బీజేపీ ఫ్లోర్ లీడర్‌మాడవేణి నరేష్ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు నాణ్యమైన విద్య ఎంతో అవసరమని, అభ్యాస్ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శోభా టీచర్, వార్తా విలేకరి రాజేందర్ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. పాఠశాల ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక ప్రముఖులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాల యాజమాన్యం అతిథులను ఘనంగా సన్మానించింది.

# తాగునీరు ప్రజలకు అందేలా కృషి చేస్తున్న సర్పంచ్ సురేష్



**ప్రజా వాయిస్ మంథని**

గ్రామాలో తాగునీటి ఎద్దడిని పరిష్కరించడానికి సర్పంచ్ చేరుకుతోట సురేష్ ట్రాక్టర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నారు. మంథని మండలం గుమ్మునుర్ గ్రామ పంచాయతీ లో గత కొన్ని రోజులుగా నీటి సమస్య ఉండడం వల్ల తక్షణమే ప్రజలు నీటి వల్ల సమస్యకు గురి కావద్దని సర్పంచ్ ఆలోచించే ట్రాక్టర్ ద్వారా ఇంటింటికీ నేరుగా సరఫరా చేస్తున్నారు. తాగునీరు అందించడం కష్టాల్లో ముందుండి పరిష్కరిస్తున్న సర్పంచికి గ్రామ ప్రజలు అభినందనలు తెలపడం జరిగింది.

# సిద్దిపేట వన్‌టౌన్ సీఐ, ఎస్సైలను సత్కరించిన జాతీయ మానవ హక్కుల కమిటీ ప్రతినిధులు



**ప్రజా వాయిస్-సిద్దిపేట**

సిద్దిపేట ఒకటవ పట్టణ (వన్‌టౌన్) సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (సీఐ)తో పాటు పలువురు సబ్ ఇన్స్పెక్టర్లను (ఎస్సై) శనివారం జాతీయ మానవ హక్కుల కమిటీ (చీ=జ) సభ్యులు, ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడు తూ.. సమాజంలో ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగకు ండా పోలీస్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగే విధంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం జాతీయ మానవ హక్కుల కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రజల పక్షాన నిలబడి, బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా తమ కమిటీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ సత్కార కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు నెమలి సుభాష్ గౌడ్, ఉపాధ్యక్షులు ప్రభు రాజ్, జనరల్ సెక్రెటరీ కార్తిక్ రెడ్డి, సలహాదారులు ఎర్రవెల్లి సంపత్ రెడ్డి, గౌరవ సలహాదారులు రాములు, టౌన్ కమిటీ అధ్యక్షురాలు సునీత, సభ్యులు సుజాత, రామ్ గోపాల్, వెంకటలక్ష్మి, కొయ్యడ చందు, రాజేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భారత సైన్యానికి కొత్త అధిపతి..

**న్యూఢిల్లీ, జూన్ 13**

ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ ను తదుపరి చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా నియమిస్తూ భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ చేయబోతున్నారు. ధీరజ్ సేథ్ జూన్ 30 మధ్యాహ్నం నుంచి ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన పదవీకాలం 2028 ఆగస్టు 31 వరకు కొనసాగనుంది. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఖడక్వాస్లా పూర్వ విద్యార్థి అయిన ధీరజ్ సేథ్ 1986లో భారత సైన్యంలో చేరారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సైన్యంలో వివిధ హోదాల్లో పని చేశారు ధీరజ్ సేథ్ దక్షిణ కమాండ్, దక్షిణ పశ్చిమ కమాండ్‌లకు సారథ్యం వహించడంతో పాటు, ఆర్మీ ప్రధాన కార్యాలయంలోనూ కీలక పదవులు చేపట్టారు. సైన్యంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు పరమ్ విశిష్ట సేవా మెడల్, ఉత్తమ్ యుద్ధ సేవా మెడల్ , అతి విశిష్ట సేవా మెడల్ వంటి ప్రతిష్మాత్మక పురస్కారాలు లభించాయి.